శనివారం
01-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 40
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హత్య కేసులో భారత సంతతి వ్యక్తికి 25 ఏళ్ల జైలు

ఒట్టావా: ఓ హత్య కేసుకు సంబంధించి భారత సంతతి వ్యక్తికి కెనడా కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మూడేళ్లనాటి కేసులో మొత్తం ముగ్గురు దోషులుగా తేలారు. ఇద్దరు యువకులకు 17 ఏళ్ల చొప్పున ఇప్పటికే శిక్ష ఖరారు కాగా... తాజాగా భారత సంతతి వ్యక్తికి శిక్ష విధిస్తూ కెనడా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. 2022 అక్టోబర్ 17న వాంకోవర్‌లోని గోల్ఫ్ క్లబ్‌లో విశాల్ వాలియా అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కారులో వెళ్తున్న సమయంలో విశాల్‌ను కాల్చి చంపిన నిందితులు... అనంతరం అతడి కారును తగలబెట్టారు. భారత సంతతికి చెందిన బాలరాజ్ సింగ్ బాస్రాతో పాటు ఇక్బాల్ కాంగ్, డియాండ్రే బాప్టిస్ట్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

రేపు షార్ నుండి ఎల్‌వీఎం 3 ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నవంబరు 2న ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. శ్రీహరికోట నుండి జరిగే ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగం ద్వారా ఇస్రో సీఎంఎస్ 03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. సీఎంఎస్ 03 అనేది బహుళ బ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇది భారత భూభాగం సహా విస్తృత సముద్ర ప్రాంతంలో సేవలు అందిస్తుంది. దాదాపు 4400 కిలోల బరువు ఉన్న సీఎంఎస్ 03 భారత్ నేల నుండి జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీటీ)కి ప్రయోగించబడే అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం అవుతుంది.

సీఎస్‌లు కోర్టుకు రావాల్సిందే: సుప్రీం

న్యూఢిల్లీ: వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై శుక్రవారం సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తంచేసింది. కోర్టు తీర్పును గౌరవించడం లేదని అసహనం వ్యక్తంచేసింది. ఈ కేసులో నవంబర్ 3న కోర్టు ముందు వర్చువల్‌గా హాజరయ్యేందుకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు అనుమతి కోరగా...అందుకు నిరాకరించింది. 'అధికారులు కోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా నిద్ర పోతున్నారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా వారు అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వ్యక్తిగతంగా వచ్చి

- మిగతా 2 లో

మద్యం కేసు నిందితుల ఆస్తుల జప్తునకు కోర్టు అనుమతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌కు ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. గతంలోనే నిందితుల ఆస్తుల జప్తునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు అనుమతి కోసం సిట్ పిటిషన్ దాఖలు చేయగా, విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతివ్వడంతో నిందితులకు సిట్ నోటీసులు జారీ చేయనుంది.

8 ఏళ్ల తర్వాత చైనా, కెనడా చర్చలు

- 2లో

ఇదీ లోకం!

తెలుగుకు ప్రాచీనహోదా ఇచ్చారు. అనవసరమైన వాళ్ళకి పదవులిచ్చారు, ఇంకెందుకు బావా ఉద్యమం పద ఇంటికి పోదాం!

మంత్రిగా అజహరుద్దీన్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ క్రికెటర్, కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ అజహరుద్దీన్ శుక్రవారం మధ్యాహ్నం 12.15నిమిషాలకు రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఇతర మంత్రులు హాజరయ్యారు. ఇప్పటికే అజహరుద్దీన్‌కు కేటాయించే శాఖలపై సీఎం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో సీటు ఆశించిన అజహరుద్దీన్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సిఫారసు చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ రెడ్డితో పాటు అజహరుద్దీన్ పేరును గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి ఓడిపోయిన అజహరుద్దీన్‌కు ఉప ఎన్నిక వేళ మంత్రిగా అవకాశం దక్కింది. రాష్ట్ర మంత్రి వర్గంలో ముస్లిం మైనార్టీ వర్గానికి ప్రాతినిధ్యం లేదు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీ ఓటింగ్ గెలుపు ఓటములను నిర్ణయించడంలో ఇది కీలక భూమిక పోషించనుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమయంలో ఓ వర్గం ఓట్ల కోసమే అజహరుద్దీన్‌ను మంత్రి చేస్తున్నారంటూ బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. అయితే ఎలాంటి అభ్యంతరాలు రాకపోవటంతో ముందుగా నిర్ణయించిన విధంగా అజహరుద్దీన్ ప్రమాణ స్వీకారం జరిగింది. అయితే అజహరుద్దీన్‌కు మంత్రి పదవి కేటాయించ డంపై విపక్షాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం చేశాయి. ఇది ఎన్నికల కోడ్ నిబంధన ఉల్లంఘన కిందకే వస్తుందని వాదించాయి. ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేబినెట్ లో మరో రెండు బెర్తులు ఖాళీ ఉన్నాయి. డిసెంబర్ లో పూర్తి స్థాయిలో మంత్రివర్గ ప్రక్షాళన దిశగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరి మంత్రి పదవులకు ఉద్వాసన... మరి కొందరికి అవకాశం... శాఖల మార్పు ఖాయంగా కనిపిస్తోంది.

ఏ శాఖైనా బాధ్యతగా నిర్వహిస్తా: అజహరుద్దీన్

అజారుద్దీన్ మాట్లాడుతూ మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి , సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి

- మిగతా 2 లో

ఎకరాకు రూ.10 వేల పరిహారం

- మృతుల కుటుంబానికి రూ.5 లక్షలు
- ఇల్లు మునిగితే రూ.15 వేలు, ఆవు...గేదెకు రూ.50 వేలు
- 12 జిల్లాల్లో తీవ్ర నష్టం: సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: 'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు ఇవ్వాలని, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ధీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరద బీభత్సంపై సీఎం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం... తాజా వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ.ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇళ్లు మునిగిన వారికి రూ.15 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50 వేలు, మేకలు, గొర్రెలకు రూ.ఐదు వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని రేవంత్ అధికారులను ఆదేశించారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే...బాధితులకు పరామర్శ

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. హెలికాప్టర్ నుంచి హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలను ఆయన వీక్షించారు. అనంతరం హనుమకొండలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం... సమ్మయ్యనగర్‌లో వరద ప్రాంతాలను, దెబ్బతిన్న నాలాలను పరిశీలించారు. తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలమైంది. లక్షలాది ఎకరాల పంటపొలాలు నీటమునిగాయి. వేలాది ఇళ్లలోకి వరద నీరు చేరింది. సర్వం కోల్పోయిన బాధితులను సీఎం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు సీఎంకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు.

నవీన్‌ను గెలిపించుకుందాం: రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెహమత్ నగర్‌లోని పీజేఆర్ విగ్రహం వద్ద నుంచి సీఎం రోడ్‌షోలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. 'రాజకీయల్లో ఒడిదుడుకులు, ఎత్తుపల్లాలు ఉంటాయి. అవకాశం అందరికీ అన్నిసార్లు రాకపోవచ్చు. అవకాశం వస్తే మన కోసం కష్టపడే వ్యక్తిని నెగ్గించుకోవాలి. అలా చేయకపోతే చారిత్రక తప్పిదమే. సెంటిమెంట్ పేరుతో ఆశీర్వదించాలని భారత రాష్ట్రసమితి ముందుకొచ్చింది. పీజేఆర్ అకాల మరణం చెందితే ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేశారు. ఆనాడు పీజేఆర్ గౌరవార్థం రాజకీయ వైరుధ్యాన్ని చంద్రబాబు పక్కనపెట్టారు. ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేయడానికి చంద్రబాబు సహకరించారు. కానీ, పీజేఆర్ కుటుంబంపై పోటీకి భారత రాష్ట్రసమితి అభ్యర్థిని నిలబెట్టింది. దుష్ట సంప్రదాయాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ నేతలు కాదా' అని రేవంత్ మండిపడ్డారు.

ఉద్యోగుల బకాయిలకు
రూ.1,032 కోట్లు
భట్టి ఆదేశాలతో విడుదల చేసిన ఆర్థిక శాఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు, పంచాయతీరాజ్ & ఆర్ అండ్ బీ శాఖ పెండింగ్ బిల్లులను ఆర్థిక శాఖ చెల్లించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రూ.1,032 కోట్లను ఏకకాలంలో విడుదల చేసింది. ప్రజా భవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో భట్టి విక్రమార్క శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ ఉన్న ఉద్యోగుల బకాయిలను దశలవారీగా చెల్లించడంపై ఆరా తీశారు. అక్టోబర్ బకాయి రూ. 712 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశంతో ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీకు సంబంధించి రూ.46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను, రోడ్లు & భవనాల శాఖకు చెందిన 3,610 బిల్లుల మొత్తం రూ.95 కోట్లను, పంచాయతీరాజ్ , గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లను విడుదల చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాల్సిందే
కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే

న్యూఢిల్లీ: బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కారణంగా దేశంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, చట్ట ప్రకారం ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే శుక్రవారం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను సంఘ్‌తో అనుసంధానం చేయడం ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అవమానించారని ఆయన ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవానికి సంబంధించి కాంగ్రెస్‌పై ప్రధాని విమర్శలు చేయడంపై ఖడ్గే మండిపడ్డారు. 1948లో మహాత్మా గాంధీ హత్య నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శిస్తూ పటేల్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఉదహరించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను మళ్లీ నిషేధించడంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... 'ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఆ విషయం బహిరంగంగా చెబుతాను. అది చేయాలి' అని

- మిగతా 2 లో

ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు



విశాలాంధ్ర-హైదరాబాద్: ఇంటర్మీడియట్ బోర్డు 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షల తేదీలు ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి.

ఫస్ట్ ఇయర్ షెడ్యూల్: ఫిబ్రవరి 25న పార్ట్ 1 (సెకండ్ లాంగ్వేజ్ - 1), 27వ తేదీన పార్ట్ 2 ఇంగ్లీష్ పేపర్-1, మార్చి 2న మ్యాథ్స్ 1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్, మార్చి 5న మ్యాథ్స్ పేపర్ 1బీ, జువాలజీ, హిస్టరీ-1, మార్చి 9న ఫిజిక్స్, ఎకానమిక్స్-1, మార్చి 12న కెమిస్ట్రీ, కామర్స్, మార్చి 17న మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 1, జియోగ్రఫీ - 1.

సెకండ్ ఇయర్ షెడ్యూల్ : ఫిబ్రవరి 26న పార్ట్ 2 (సెకండ్ లాంగ్వేజ్ -2), 28న పార్ట్ 1 ఇంగ్లీష్ పేపర్-2, మార్చి 3న మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ -2, మార్చి 6న మ్యాథ్స్ పేపర్ 2బీ, జువాలజీ, హిస్టరీ -2, మార్చి 10న ఫిజిక్స్, ఎకానమిక్స్ -2, మార్చి 13న కెమిస్ట్రీ, కామర్స్ -2, మార్చి 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ 2, మార్చి 18న మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 1, జియోగ్రఫీ - 1.

దశలవారీ కాలుష్య రహిత రవాణా సేవలు

- డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు
- పన్ను ప్రయోజనాలు కల్పిస్తూ 'ఈవీ' పాలసీ
- సమీక్షలో మంత్రి పొన్నం

2 లో

మా దృష్టిలో 'జీడీపీ' అంటే...
గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్

2017 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
రైతును పారిశ్రామికవేత్తగా మారుస్తాం
సీఐఐ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తమ ప్రభుత్వం దృష్టిలో 'జీడీపీ' అంటే కేవలం 'గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్' కాదని, గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్(జీఈపీ) అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారత్ 15 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో 'తెలంగాణ'ను కీలక

- మిగతా 2 లో

నెదర్లాండ్స్‌లో డీ 66 ఘన విజయం

మధ్యేవాద వామపక్షానికి డచ్ ప్రజల ఓటు

పార్లమెంటులో మూడు రెట్లు పెరిగిన పార్టీ బలం

తొలి గే ప్రధానిగా యువ నేత రాబ్ జెట్టన్‌కు పగ్గాలు

ది హేగ్: నెదర్లాండ్స్ సార్వత్రిక ఎన్నికల్లో మధ్యేవాద వామపక్ష పార్టీ డీ 66 ఘన విజయం సాధించింది. పార్లమెంటులో దాని స్థానాలను మూడు రెట్లు పెంచుకున్నది. 2023లో రికార్డు మెజారిటీ సాధించిన ఫ్రీడమ్ పార్టీ (పీవీవీ)ని ఘోరంగా ఓడించింది. డచ్ ట్రంప్‌గా పేరు గాంచిన పీవీవీ నాయకుడు గ్రీట్ విల్డర్స్‌ను డీ 66 ప్రధాని అభ్యర్థి రాబ్ జెట్టన్ చిత్తు చేశారు. తాను గే అని ఆయన ప్రకటించుకున్న నేపథ్యంలో దేశానికి తొలి గే ప్రధాని కాబోతున్నారు. అదే సమయంలో పిన్న వయస్సు ప్రధానిగానూ 38 ఏళ్ల రాబ్ జెట్టన్ పగ్గాలు చేపట్టబోతున్నారు. డీ 66 గెలుపుతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. విద్వేష రాజకీయాలకు స్వస్థి పలకబోతున్నామని విజయోత్సవ సభలో రాబ్ జెట్టన్ ఉద్ఘాటించారు. అతివాదాన్ని సైతం ఓడించవచ్చని నెదర్లాండ్స్‌కే కాదు మొత్తం ప్రపంచానికి నిరూపించామన్నారు. డచ్ ప్రజలు విద్వేషపూరిత ప్రతికూల రాజకీయాలకు స్వస్థి పలికారని ఆయన అన్నారు. గృహ సమస్య, విద్యా రంగంలో పెట్టుబడులు, ఇమ్మిగ్రేషన్ సమస్యలకు పరిష్కారం చూపుతానంటూ ఇచ్చిన హామీలతో గత నెల రోజుల్లో జెట్టన్‌కు ప్రజాదరణ భారీగా పెరిగింది. యూరప్‌లో పేరుగాంచిన నాయకుల్లో ఒకరైన గ్రీట్ విల్డర్స్ మతతత్వవాది. ముస్లింల వ్యతిరేకి. శరణార్థి విధానాన్ని తిరస్కరించాలని, ఉక్రెయిన్ శరణార్థులను తిరిగి పంపించాలని, విద్యుత్-ఆరోగ్య సంరక్షణ రంగాలకు ఆర్థిక తోడ్పాటు కోసం సంక్షేమ నిధి నిలిపివేయాలని ఆయన ప్రతిపాదనలు చేశారు. దీంతో ఆయన మతతత్వవాద సిద్ధాంతాలను డచ్ ప్రజలు తిరస్కరించారు. డీ 66ను గెలిపించారు.

పాక్-అఫ్ఘాన్ చర్చలు పున:ప్రారంభం

ఇస్లామాబాద్: పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య శాంతి చర్చల్లో ప్రతిష్టంభన తొలగింది. టర్కీ మధ్యవర్తిగా చర్చలు పున:ప్రారంభం కాబోతున్నాయి.

ఈ మేరకు ఓ ఉమ్మడి ప్రకటనను టర్కీ శుక్రవారం విడుదల చేసింది. సరిహద్దుల్లో కాల్పుల విరమణ, శాంతి నెలకొల్పేందుకు చర్చలను పున:ప్రారంభించేలా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిపింది. ఇస్తాంబుల్ వేదికగా జరిగిన చర్చలు విఫలం కావడంతో నవంబరు 6న కీలక నేతలు భేటీ కాబోతున్నట్లు తాజా ప్రకటనలో పేర్కొంది. శాంతి కోసం రెండు దేశాలు సానుకూలంగా ఉన్నట్లు టర్కీ విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

శాంతికి ఓకే... ఉగ్రవాదానికి కాదు: మునీర్

పొరుగు దేశాలతో శాంతిని కోరుకుంటున్నప్పటికీ ఉగ్రవాదాన్ని సహించేది లేదని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ స్పష్టంచేశారు. అఫ్ఘాన్ భూభాగం నుంచి తమ దేశంపై ఉగ్ర దాడులు జరిగేందుకు ఆస్కారం ఇవ్వబోమని ఉద్ఘాటించారు. అఫ్ఘాన్ నుంచి సరిహద్దు ఆవలి ఉగ్రవాదం కొనసాగినప్పటికీ పాకిస్థాన్ ఎంతో సహనం ప్రదర్శించిందని, అనేకమార్లు దౌత్య-ఆర్థిక పరంగా పరిష్కారానికి ప్రయత్నించిందని చెప్పారు. అయితే భారత్ మద్దతులో అఫ్ఘాన్ రెచ్చిపోతోందని ఆరోపించారు.

8 ఏళ్ల తర్వాత చైనా, కెనడా చర్చలు



బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అపెక్ సదస్సు నేపథ్యంలో కెనడా, జపాన్ అధినేతలతో అధికారికంగా సమావేశాలు నిర్వహించారు. అనేక అంశాలపై చర్చించారు. అయితే కెనడా ప్రధాని మార్క్ కార్నేతో జిన్‌పింగ్ దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత భేటీ అయ్యారు. ఈ మేరకు చైనా మీడియా పేర్కొంది. 2017 నుంచి ఈ దేశాధినేతల మధ్య చర్చలు స్తంభించిపోయాయి. పశ్చిమ దేశాలతో పోల్చుకుంటే కెనడాతో చైనాకు సత్సంబంధాలు లేవు. 2018లో అమెరికా వారెంట్‌పై చైనా టెలికం సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను వాంకోవర్‌లో అరెస్టు చేసిన తర్వాత రెండు దేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. చైనా స్టీల్ దిగుమతులపై అదనంగా 25 శాతం సుంకాన్ని ఈ ఏడాది జులైలో కెనడా ప్రకటించింది. దీంతో కెనడా నుంచి కనోలా (నూనె గింజ) దిగుమతులపై 75.8 శాతం తాత్కాలిక కస్టమ్స్ సుంకాన్ని చైనా ప్రకటించింది. అమెరికా సుంకాలతో విరుచుకుపడే క్రమంలో అమెరికా-చైనాకు మధ్య ఒప్పందాల వేళ కెనడా ప్రధానితో జిన్‌పింగ్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

జపాన్ ప్రధానితోనూ భేటీ

జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా ఇటీవల ఎన్నికైన సనాయే తకైచీతో జిన్‌పింగ్ భేటీ అయ్యారు. చైనా ప్రవర్తన, సెంకాకు దీవుల (దయాయు దీవులుగా చైనా గుర్తిస్తుంది)కు సంబంధించి జిన్‌పింగ్‌తో తకైచీ చర్చించినట్లు జపాన్ మీడియా పేర్కొంది. చైనా జైళ్లలో మగ్గుతున్న జపాన్ పౌరులను త్వరగా విడుదల చేయాలని కూడా ప్రధాని కోరారని తెలిపింది.

చైనాలో ఉంటున్న జపాన్ పౌరులకు సముచిత భద్రత కల్పించాలని జిన్‌పింగ్‌కు తకైచీ విజ్ఞప్తి చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

మంత్రిగా అజహరుద్దీన్ ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదనని, తన మంత్రి పదవికి, జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముడి పెట్టొద్దని పేర్కొన్నారు. రెండింటిని వేర్వేరుగా చూడాలని, తానేంటో ప్రజలందరికీ తెలుసన్నారు. తనకు ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తాని అజారుద్దీన్ స్పష్టం చేశారు.

అజహరుద్దీన్‌పై అక్కసెందుకు? మహేశ్ కుమార్ గౌడ్

అజహరుద్దీన్‌పై ఎలాంటి కేసులు ఉన్నాయో బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిలదీశారు.

భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఆయన ఎన్నో విజయాలు అందించిన విషయం కిషన్ రెడ్డి మరిచిపోయారా అని మండిపడ్డారు. ఎంపీగా కూడా అజహరుద్దీన్ ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. అజహరుద్దీన్ మంత్రి పదవిపై బీజేపీ నేతలు ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారో అర్థంకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం వల్ల మైనారిటీలకు మేలు జరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు.

దశలవారీ కాలుష్య రహిత రవాణా సేవలు

విశాలాంధ్ర - హైదరాబాద్ :

నగరంలో కాలుష్య రహిత రవాణా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుంది. ఈ నేపథ్యంలో పీఎం ఈ- డ్రైవ్ కింద కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ కి కేటాయిస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు ,మౌలిక సదుపాయాలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో శుక్రవారం సెక్రటేరియట్ లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నిలబెట్టడానికి డీజిల్ బస్సుల స్థానంలో పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం దశలవారీగా ప్రవేశపెడుతుందని మంత్రి అన్నారు. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా పీఎం ఈ- డ్రైవ్ కింద తొమ్మిది నగరాల్లో 15 వేల ఎలక్ట్రిక్ బస్సులు కేంద్రం ప్రవేశపెడుతుందన్నారు. అందులో భాగంగా హైదరాబాద్ నగరానికి రెండు వేల ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేసిందన్నారు. సబ్సిడీ కింద ఒక్కో బస్సుకు రూ.35 లక్షలు కేంద్రం కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను మరింత ప్రోత్సహించడానికి టూ వీలర్స్, త్రీవీలర్స్ , ఫోర్‌వీలర్స్, బస్సులు, ట్రక్కులు, ట్రాక్టర్లు వంటి ఇత్యాది వాహనాలకు పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'ఈవీ' పాలసీని తీసుకొచ్చిందన్నారు. విశ్వసనీయత, సేవా నాణ్యత పరంగా డీజిల్ బస్సులతో సమానమైన పనితీరు సాధించాలన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, అధికారులు, ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, 2019, మార్చిలో 40 యూనిట్లతో దేశంలోనే ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని ప్రత్యేకంగా చెప్పవచ్చు. 2023 ప్రణాళిక కింద 1,010 అదనపు ఎలక్ట్రిక్ బస్సులను (510 ఇంటర్‌సిటీ, 500 సిటీ బస్సులు) చేర్చాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు ఇప్పటికే లెటర్స్ ఆఫ్ అవార్డును జారీ చేసింది. ప్రస్తుతం, 775 ఎలక్ట్రిక్ బస్సులు (510 ఇంటర్‌సిటీ, 265 సిటీ బస్సులు) నడుస్తున్నాయి. 2026, మార్చి నాటికి మిగిలిన 275 బస్సులు అందుబాటులోకి రానున్నట్లు ప్రాథమిక అంచనా వేసింది. ఈ-బస్ రంగంలోని రెండు ప్రముఖ భారతీయ ఓఈఎంలతో టీజీఆర్టీసీ గణనీయమైన ఆపరేటింగ్ అనుభవాన్ని పొందింది. అయితే గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కంపెనీల ప్రతినిధులతో ఎదురవుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లింది. కొంతమంది ఆపరేటర్లు టెండర్ షరతులను పాటించకపోవడం, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో జాప్యం వంటివి జరుగుతు న్నాయి. బస్‌ల అందజేతలో అసాధారణ జాప్యం... బ్రేక్‌డౌన్ ఫ్రీక్వెన్సీ పరంగా బస్‌ల పనితీరు తక్కువగా ఉండటం... డీజిల్ బస్సులతో పోలిస్తే సర్వీస్ రద్దు, ప్రమాద రేటు ఎక్కువ నమోదు వంటివి జరుగుతున్నాయి.తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసిన డిపోలలో అప్‌స్ట్రీమ్ హై-టెన్షన్ విద్యుత్ కనెక్షన్‌లను సకాలంలో ఏర్పాటు చేస్తుంది.

సీఎస్‌లు కోర్టుకు రావాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

వివరించాలి. కోర్టు సమయం ఇచ్చినా ఎలాంటి చర్యలు లేకపోవడం దురదృష్టకరం' అని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా మందలించింది. తమ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని బీహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన అభ్యర్థనను తోసిపుచ్చింది. 'రాష్ట్రంలో అంతా ఎన్నికల సంఘం చూసుకుంటుంది. మీరు చింతించకండి. కోర్టుకు రండి' అని తేల్చిచెప్పింది.

వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న ఆదేశించింది. దానిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ కేసును విచారించింది. ఆ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడినుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంటూ... ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది. ఆ ఆదేశాల అమలుపై తీసుకుంటున్న చర్యలను తెలియజేసేలా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే తెలంగాణ, పశ్చిమబెంగాల్, దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే వాటిని దాఖలు చేశాయి. ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వీధి కుక్కల దాడులు నమోదవుతుండటాన్ని గత విచారణలో తీవ్రంగా పరిగణించింది. దీంతో అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. తాజాగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరగా ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఎందుకంటే శాంతిభద్రతల సమస్యలు అన్నీ బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కారణంగానే తలెత్తుతున్నాయని తెలిపారు. పటేల్ మన ముందు ఉంచిన విషయాలను ప్రధాన మంత్రి, హోం మంత్రి అమిత్ షా గమనించాలని ఆయన అన్నారు. పటేల్ స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించినప్పుడు... 'అప్పుడు సహజంగానే ఆయన మన వల్లభాయ్ పటేల్ జీని అగౌరవపరుస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించడానికి గల కారణాలను పటేల్ స్వయంగా వెల్లడించారు. ఎటువంటి అస్పష్టత లేదు' అని ఖర్గే అన్నారు. ఐక్యత, శాంతిని తీసుకురావాలని పటేల్ కోరుకున్నారని, దాని కోసం తాను పోరాడానని కాంగ్రెస్ అధ్యక్షుడు చెప్పారు. 'కానీ దేశంలో ఐక్యత తీసుకువచ్చిన తర్వాత ఆ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించే ఎవరికైనా గుణపాఠం నేర్పాలి. ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్న వ్యక్తులు ఎవరో మీకు తెలుసు' అని తెలిపారు. ఇది అనైక్యత వాతావరణాన్ని సృష్టిస్తుందా అని అడిగిన ప్రశ్నకు... 'ముగిసిపోయిన ఏదో ఒకటి, ఈ ప్రభుత్వం దానిని పునరుద్ధరించిందని నేను భావిస్తున్నాను. దేశంలో ఏమి జరిగినా ఈ వ్యక్తులే బాధ్యత వహిస్తారు' అని అన్నారు. 2024 వరకు ఏమీ జరగలేదని, ఇప్పుడు మరోసారి ప్రజలను మేల్కొల్పడం దేశానికి మంచిది కాదని ఆయన అన్నారు. 'ఇది దేశానికి మంచిది కాదు. విషం రుచి చూసినట్లే, దాని ఫలితం మరణం తప్పదు. మరోసారి విషం రుచి చూడాల్సిన అవసరం లేదు. మోదీ జీ చేస్తున్న పనులు దేశానికి మంచిది కాదు' అని తెలిపారు. నేడు పటేల్ జయంతి... మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ వర్థంతి అని పేర్కొంటూ, 'ఈ ఇద్దరు గొప్ప నాయకులు 'ఉక్కు మనిషి', 'ఉక్కు మహిళ'. దేశానికి పెద్ద సహకారం అందించారు. ఐక్యతను కొనసాగించడానికి కృషి చేశారు' అని తెలిపారు. ఇది కాంగ్రెస్ చరిత్ర, దాని సహకారం అని ఖర్గే ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా అప్పుడు హోం మంత్రిగా ఉన్న పటేల్... శ్యామా ప్రసాద్ ముఖర్జీకి రాసిన లేఖను ఉదహరించారు. అందులో పటేల్... మహాత్మా గాంధీ హత్యకు దారితీసిన వాతావరణాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సృష్టించినట్లు పేర్కొన్నారని ఖర్గే వివరించారు. భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పటేల్ మధ్య గొప్ప సంబంధాలు ఉండగా...వారి మధ్య చీలిక తీసుకురావడానికి ప్రయత్నించారని అన్నారు. భారతదేశ ఐక్యతకు కృషి చేసినందుకు పటేల్‌ను నెహ్రూ ప్రశంసించారని, దేశానికి ఆదర్శంగా అభివర్ణించారని చెప్పారు. 'గాంధీజీ మరణంపై ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఇది వ్యతిరేకతను మరింత తీవ్రతరం చేసింది. ఈ పరిస్థితులలో ప్రభుత్వానికి ఆర్‌ఎస్‌ఎస్‌పై చర్యలు తీసుకోవడం తప్ప వేరే మార్గం లేదు. ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభ కార్యకలాపాల కారణంగా దేశంలో ఏర్పడిన వాతావరణమే గాంధీజీ హత్యకు దారితీసిందని నివేదిక రుజువు చేస్తుంది' అని ఫిబ్రవరి 4, 1948న ముఖర్జీకి పటేల్ రాసిన లేఖలో అంశాలను ఖర్గే ప్రస్తావించారు.

పటేల్‌కు ఖర్గే, రాహుల్ నివాళి

అంతకుముందు పటేల్ 150వ జయంతి సందర్భంగా ఖర్గే ఆయనకు నివాళులర్పించారు. 'పటేల్‌ను భారతదేశ గొప్ప ఉక్కు మనిషి' గా అభివర్ణించారు. ఆయన మొత్తం దేశాన్ని ఐక్యత, సమగ్రతకు చెందిన దారంలో అల్లిన వ్యక్తి అని అన్నారు. రాహుల్ గాంధీ కూడా దేశ తొలి హోం మంత్రికి ఘన నివాళులర్పించారు. 'భారతదేశాన్ని ఒకే దారంలో అల్లడం ద్వారా ఆయన దేశ ఐక్యత, సమగ్రతకు బలమైన పునాది వేశారు. పటేల్ అజేయమైన ధైర్యం, దూరదృష్టి, ఆదర్శాలు ఎప్పటికీ మనకు మార్గనిర్దేశం చేస్తాయి' అని రాహుల్ గాంధీ అన్నారు. 1875లో గుజరాత్‌లోని నాడియాద్‌లో జన్మించిన పటేల్ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక వ్యక్తి. ఆయన 1950లో మరణించారు.

మా దృష్టిలో 'జీడీపీ' అంటే... గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామిగా మార్చుతామన్నారు. బేగంపేట్ ఐటీసీ కాకతీయలో శుక్రవారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. 'డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్ బీ తెలంగాణ రోడ్ మ్యాప్ టూ త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ' అనే అంశంపై మంత్రి కీలక ఉపన్యాసం చేశారు. 'అర్బన్ ఇంజిన్', 'ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ్', 'రూరల్ ట్రాన్స్‌ఫర్మేషన్ జోన్' అనే మూడు మూల స్థంభాలుగా తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఆయన వివరించారు. ఇందుకోసం అమలులో వేగం, అవకాశాలలో పారదర్శకత, రూపకల్పనలో 'ఫ్యూచర్-రెడీ'గా ఉండే కొత్త అభివృద్ధి నమూనాకు 'రోడ్‌మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 350 బిలియన్ డాలర్లకు చేరేలా సర్వీసెస్, సస్టైనబిలిటీ, స్మార్ట్ లివింగ్ కు గ్లోబల్ క్యాపిటల్, నెట్-జీరో ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని గ్లోబల్ 'చైనాం 1' అవకాశాన్ని అందిపుచ్చుకునేలా కీలకమైన పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి రైతును పారిశ్రామికవేత్తగా మార్చేలా అగ్రి-ప్రాసెసింగ్ క్లస్టర్లు, డిజిటల్-అనుసంధానం కలిగిన ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ, ఇమేజ్ టవర్స్, టీ-హబ్ ఫేజ్ 2 ద్వారా రాష్ట్రంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ మరింత పటిష్టమవుతుందన్నారు. రాష్ట్రంలో 2030 నాటికి '20 గిగావాట్స్' పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వాటితో పోటీపడేలా 'మేక్ ఇన్ సౌత్, స్కేల్ ఫర్ ది వరల్డ్' ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు దక్షిణాది రాష్ట్రాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. 'విశ్వసనీయమైన లాంచ్ ప్యాడ్'గా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఏపీ తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, డిప్యూటీ ఛైర్మన్ రవి చంద్రన్, సీఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ శివప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసు

ఐదుగురికి ఉరి

విశాలాంధ్ర-చిత్తూరు:

చిత్తూరు మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ హత్య కేసులో ఐదుగురు దోషులకు చిత్తూరు కోర్టు శుక్రవారం ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. తీర్పు నేపథ్యంలో చిత్తూరు కోర్టు వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ముందు జాగ్రత్తగా కోర్టు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు చిత్తూరు నగరంలో 144 సెక్షన్ విధించారు. కోర్టుకు వచ్చే ప్రతి ఒక్కరినీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపారు. 2015 నవంబరు 17న అప్పటి చిత్తూరు మేయర్ కటారి అనురాధ, మోహన్ దంపతుల హత్య జరిగింది. నగర పాలక సంస్థ కార్యాలయంలోనే ఈ ఘటన చోటుచేసు కుంది. ఈ కేసులో ఐదుగురు నిందితుల ప్రమేయం ఉందని చిత్తూరులోని ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. న్యాయస్థానం వారికి శుక్రవారం ఉరిశిక్ష ఖరారు చేసింది. ఈ కేసులో తొలుత 23 మందిని నిందితులుగా పేర్కొన్నారు. తనకు కేసుతో సంబంధం లేదని కాసరం రమేష్(ఏ22) పిటిషన్ దాఖలు చేయగా... అతడి పేరును తప్పిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. కేసు విచారణ సాగుతుండగానే ఎస్.శ్రీనివాసాచారి(ఏ21) మృతిచెందారు. దాంతో 21 మంది నిందితులుగా ఉన్నారు. ఇందులో మేయర్ భర్త మోహన్ మేనల్లుడు శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ(ఏ1), గోవిందస్వామి శ్రీనివాసయ్య వెంకటాచలపతి అలియాస్ వెంకటేష్(ఏ2), జయప్రకాష్‌రెడ్డి అలియాస్ జయారెడ్డి(ఏ3), మంజునాథ్ అలియాస్ మంజు(ఏ4), మునిరత్నం వెంకటేష్(ఏ5) దోషులుగా తేలారు. దీంతో వారికి ఉరిశిక్ష విధించింది. దోషుల్లో ఏ1గా ఉన్న చింటూ రూ.70 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. కటారి అనురాధ, మోహన్ వారసులకు రూ.50 లక్షలు, గాయపడిన వేలూరి సతీష్ కుమార్ నాయుడికి రూ.20 లక్షలు చెల్లించాలని స్పష్టం చేసింది. కాగా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న కటారి మోహన్‌కు చింటూ మేనల్లుడు. వారి మధ్య వ్యక్తిగత, ఆర్థిక, రాజకీయ విభేదాలు తలెత్తాయి. దీంతో మేయర్‌గా ఉన్న అనురాధ, మేనమామ మోహన్‌ను అడ్డు తొలగించుకోవాలని చింటూ నిర్ణయించుకున్నాడు. 2015 నవంబరు 17న చింటూ, మరో నలుగురు బురఖాలు ధరించి తుపాకులు, కత్తులతో చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోకి ప్రవేశించారు. కటారి అనురాధపై చింటూ, మరికొందరు తుపాకులతో కాల్పులు జరపగా... ఆమె అక్కడే నేలకొరిగారు. పక్క గదిలో ఉన్న కటారి మోహన్‌ను కత్తులతో నరికారు. కొన ఊపిరితో ఉన్న మోహన్ వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మరణించారు. మేయర్ దంపతుల హత్య సమయంలో అక్కడే ఉన్న వేలూరి సతీష్ కుమార్ నాయుడినీ చంపేందుకు మంజునాథ్(ఏ4) యత్నించడంతో అప్పట్లో హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశారు. ఇందులోనూ నేరం రుజువైంది. హంతకులకు ఆయుధాలు సమకూర్చడం, ఆశ్రయం ఇవ్వడం, ధనసాయం చేశారని మిగిలిన 16 మందిపై పోలీసులు అభియోగం మోపగా విచారణలో రుజువు కాలేదు.

అన్నదాత ఆక్రందన

విశాలాంధ్ర-డిజిటల్: మొంథా తుపాను అన్నదాతలపై పంజా విసిరింది. చేతికొచ్చిన పంటలను నేలకూల్చి రైతన్నలను కోలుకోలేని దెబ్బతీసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తన ప్రభావం చూపి రూ.వేలకోట్లు నష్టాన్ని చేకూర్చింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా ఏర్పడిన మొంథా తుపాను ఆపై తీవ్ర తుపానుగా మారి మూడు రోజుల పాటు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసింది. ఏక్షణం ఏం ఉపద్రవం వచ్చిపడుతుందోనని ఆందోళన చెందారు. ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ ... క్షణంక్షణం దోబూచులాడుతూ చివరికి బందరు - కాకినాడ మధ్య అంతర్వేదిలో తీరం దాటింది. ఆ సమయంలో వీచిన ఈదురుగాలులు, భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, అరటి, పసుపు, బొప్పాయి పంటలు నేల వాలాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 30 జిల్లాల్లో మొంథా ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల పంట వరదపాలైంది.

ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో 38 వేల హెక్టార్లలో వరి, 1.38 హెక్టార్లలో ఉద్యాన పంటలు నాశనమయ్యాయి. అప్పులు చేసి మరీ లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, చేతికొచ్చిన పంట నేలపాలైందని రైతన్నలు కన్నీరు కారుస్తున్నారు. తుపాను వల్ల ఏపీలో సుమారు రూ.5,285 కోట్ల మేర నష్టం వాటిల్లిందని స్వయానా సీఎం చంద్రబాబు వెల్లడించారు. 403 మండలాలు, 14,944 గ్రామాలపై తుపాను ప్రభావం చూపింది. తెలంగాణలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర మంత్రి తుమ్మల స్వయంగా ప్రకటించారు. సుమారు మూడు లక్షల ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి నేలపాలైందని వివరించారు. ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే లక్షా 30 వేల ఎకరాల పైబడి పంటకు నష్టం వాటిల్లిందని, రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల మంది రైతుల కష్టార్జితం వరదపాలైందని చెప్పడం మొంథా ప్రభావం ఏమేరకు ఉందో ఇట్టే అర్థమౌతుంది. అంతేకాదు, భారీ వర్షాలు... ఆపై వరద ప్రభావం వల్ల వాగులు, వంకలు ఏకమై గ్రామాలను చుట్టుముట్టి ప్రజలను కోలుకోలేని దెబ్బతీసింది. జనజీవనాన్ని స్తంభింపచేసింది. పంట పొలాలన్నీ చెరువును తలపించడంతో రైతన్నకు గుండె కోత తప్ప మిగిలింది ఏమీ లేదు. కౌలురైతులు గుండెలు బాదుకుంటున్నారు. లక్షల్లో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టామని, తీరా చేతికొచ్చిన పంట మోదుబారడం తో బతుకుపై ఆశలు సన్నగిల్లాయని, ప్రభుత్వం న్యాయం చేయకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని చేతులెత్తి దండం పెడుతున్నారు. పంటల సంగతి పక్కన పెడితే... మార్కెట్ యార్డ్‌కు తోలిన ధాన్యం వరద నీటిలో కలిసిపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట అక్కరకు రాలేదంటూ గుండెలదిలేలా రైతన్నలు రోదించిచడం చూపరులను కలిచివేసింది. ప్రభుత్వాలు తమకు న్యాయం చేసి తమ కుటుంబాలను ఆదుకుంటాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు భూమిని నమ్మిన కష్టజీవులు.

ఎన్టీఆర్ వైద్య సేవల పునరుద్ధరణ

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవను శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) వెల్లడించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, ఆషా ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమ య్యాయి. కొన్ని రోజులుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఆ శాఖ అధికారులతో జరుపుతున్న చర్చలు కొలిక్కి వచ్చాయని, తమ బకాయిలన్నిం టిని నవంబరు నెలాఖరులోగా పూర్తిగా చెల్లించేలా మంత్రి హామీ ఇచ్చారని, దీంతో ఎన్టీఆర్ వైద్య సేవలను పూర్తి స్థాయిలో పునరుద్ధరిసు న్నట్లు శుక్రవారం సచివాలయంలో మంత్రితో సమావేశం అనంతరం ఆషా ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంత్రికి లిఖిత పూర్వకంగా లేఖ అందజేశారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి సత్యకుమార్ ఛాంబరులో మంత్రి, అసోసియేషన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి ప్రభుత్వ బకాయిలను వన్ టైం కింద చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం అమలులోకి వచ్చేలోగా మూడో విడత కింద మరికొంత మొత్తా న్ని చెల్లించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదిలాఉండగా, అక్టోబరు 10 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు తమ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సేవలను నిలిపివేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు మంత్రి సత్యకుమార్ ప్రయత్నంతో ప్రభుత్వం రెండు విడతల్లో కలిపి రూ.488 కోట్లు చెల్లించింది. మరో విడత కింద కొంత మొత్తం చెల్లింపులు జరిగిన అనంతరం సుమారు రూ.2,500 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని బ్యాంకుల నుంచి ప్రభు త్వం రుణం రూపంలో ఆసుపత్రుల వారికి చెల్లించేందుకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చే నాటికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు తరపున ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిల విలువ రూ.2,403.92 కోట్లు. ఆ తరువాత నుంచి అక్టోబరు 27వ తేదీ వరకు రూ.5,419 కోట్ల బిల్లులు ఎన్టీఆర్ ట్రస్టుకు ఆసుపత్రుల నుంచి వచ్చాయి.

సీపీఎం నేత సామినేని దారుణ హత్య

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: సీపీఎం సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామినేని రామారావు శుక్రవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని... కొన్ని దశాబ్దాలుగా సీపీఎంలో అంచలంచెలుగా ఎదిగారు. పాతర్లపాడులోని తన స్వగృహంలో గుర్తుతెలియని వ్యక్తులు... కుటుంబ సభ్యులు చూస్తుండగానే కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. అక్కడికక్కడే మృతి చెందారు. రామారావు హత్య ఖమ్మం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉప ముఖ్యమంత్రి భటి& విక్రమార్క హత్యను ఖండించారు. నిందితులు ఎంతటవారైనా వదిలిపెట్టేది లేదని ప్రకటించారు. ఇది కాంగ్రెస్ వారి పనే అంటూ సీపీఎం రాష్ట్ర నాయకులు ఆరోపించారు. పాతర్లపాడు లో తమ పార్టీ బలంగా ఉన్నందునే రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ గెలవాలని ఉద్దేశంతో తమ నాయకుడిని దారుణంగా హత్య చేశారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. హత్య వార్త తెలియగానే ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కాగా, సామినేని భౌతికకాయాన్ని స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం... రామారావు భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ హత్యను ఖండించారు. సీపీఐ కేంద్ర సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర మహిళా నాయకురాలు పోటు కళావతి, జిల్లా సమితి సభ్యులు ఎర్ర బాబు, జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వరరావు తదితరులు రామారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు మొహమ్మద్ జావేద్ సహా కాంగ్రెస్ జిల్లా కమిటీ నాయకులు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మాస్ లైన్ నాయకులు ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి... రామారావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

హంతకులను అరెస్ట్ చేయండి

మృతదేహాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు , సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు సందర్శించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: మొంథా తుపాన్ బీభత్సం వలన పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం సర్వే నిర్వహించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లాలోని కొరవి మండల పరిధిలో మొంథా తుపాన్ వలన నష్టపోయిన పత్తి, వరి పంటలను సీపీఐ బృందం పరిశీలించి, రైతాంగాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి రంగు మారిపోయి తీవ్రంగా రైతాంగం నష్టపోయారని, వరి చేతికొచ్చే దశలో తుపాను తాకిడితో పంట కింద పడిపోయి రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వెంటనే అధికార యంత్రాంగం సమగ్ర సర్వే నిర్వహించి పంట నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకొని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, కొరివి పట్టణ కార్యదర్శి తురక రమేష్, బుర్ర సమ్మయ్య, కలగూర నాగరాజు, అప్పాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

విశాలాంధ్ర,బ్యూరో,నిర్మల్,జిల్లా : పోలీస్ అమరవీరుల కొవ్వొతిర్యాలీలో ప్రజాసేవలో ప్రథమ స్థానంలో నిలుస్తూ ప్రజారక్షణకు పాటుపడుతున్న పోలీసులు విధి నిర్వహణలో అసువులు బాసిన వారి త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు శుక్రవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు తెలంగాణ రాష్ట్ర పోలీసులు జాతీయ స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు గర్వకారణం అన్నారు . పోలీసుల వృత్తి ప్రజాసేవకే అంకితం గా పరిగణించబడుతుందని రేయింబవళ్లు ప్రజారక్షణలో ప్రథమ స్థానంలో నిలుస్తున్న పోలీసులకు ఆయన సెల్యూట్ చేశారు ప్రతి ఒక్కరు పోలీసులతో సమన్వయంతో ముసలికొని సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే విధి నిర్వహణలో ఉన్న పోలీసులు అసువులు బాచింది ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని ఆమె స్పష్టం చేశారు వారి ఆత్మకు శాంతి చేకూరేలా నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుండి పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీసు అమరవీరుల స్తూపం వరకు ఈ కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది అమరవీరులకుజోహార్లు అంటూ నిలదీస్తూ ఈ ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ , ఎస్పీ జానకి షర్మిల ఎస్పీ రాజేష్ మీనాలు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ ఎ. సుజాత రెడ్డి, అటవీ క్షేత్రాధికారి కిరణ్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు రాహుల్ గైక్వాడ్ జ్యోతి మణి హనుమాన్లు సాయి కృష్ణ కడెం,%ఐసాయికిరణ్ లతోపాటు వివిధ పార్టీల నాయకులు దయానంద్ రాజు రసత్యం మంత్ర రాజ్యం సురేష్, ఆమందా శ్రీనివాస్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఎ.

ఉద్యోగ విరమణ

విశాలాంధ్ర గూడూరు: జిల్లాలోని గూడూరు మండలం సీతానగరం గ్రామపంచాయతీ పరిధిలోవున్న ఏహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో మోటూరి రమాదేవి కాశీనాథం దంపతులకు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కాశీనాథ్ గత 23 సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబోధన అందించాడనీ విద్యార్థులతో తోటి ఉపాధ్యాయులతో తన మంచితనం ఓర్పు నేర్పడతానంతో అందరినీ ఆకట్టుకున్నాడని అన్నారు. కార్యక్రమంలో వార్డెన్ బాలాజీ, రమేష్ తోటి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యాన్ని సంతోషంగా గడపాలి

విశాలాంధ్ర-కోదాడ : విశ్రాంత ఉద్యోగులు వృద్ధాప్యాన్ని సంతోషంగా గడపాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావేళ్ల సీతారామయ్య అన్నారు. కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో అక్టోబర్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను శుక్రవారం కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సామూహికంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రావేళ్ల సీతారామయ్య పాల్గొని మాట్లాడారు.విశ్రాంత ఉద్యోగులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆనందంగా సంతోషంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిదని వృద్ధాప్యంలో సమస్యలకు దూరంగా ఉంటూ సంతోషంగా గడపాలన్నారు.ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలన్నారు. సంఘ అభివృద్ధిలో సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ కార్యదర్శి పందిరి రఘు, ఆర్థిక కార్యదర్శి తమ్మనబోయిన వీరబాబు, ఉపాధ్యక్షులు గులాం ఎస్ దాని, అసోసియేట్ ప్రెసిడెంట్ వరకాల జానయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి హాజీ నాయక్,బాలేమియా, బిక్షం తదితరులు పాల్గొన్నారు.



సీపీఐకి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది సంబరాల ముగింపు సందర్భంగా జరిగే భారీ బహిరంగ సభప్రదర్శనకు సంబంధించి క్రైస్తవ ప్రముఖులు లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. శుక్రవారం సీపీఐ జాతీయ సమితి -సభ్యులు బాగం హేమంతరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హేమంతరావు వారికి సిపిఐ ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సిపిఐ సెక్యులరిజం పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాడుతుందన్నారు. క్రిస్టియన్ ప్రముఖులు మాట్లాడుతూ సిపిఐ ప్రజా ఉద్యమాలను స్వాగతిస్తున్నామని నాయకత్వ స్థాయిలో సేపిఐ చేపట్టిన సామాజిక న్యాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే రీతి ఆదరణ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, క్రిస్టియన్ ప్రముఖులు శేఖర్ బాబు, పిల్లి విజయ్ పాల్, కంటెపూడి జాన్సన్, జెట్టి సుధాకర్, జాసన్, -సంజీవరావు, మార్టిన్, జొన్నలగడ్డ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజం అజరామరం... వందేళ్లయిన ఇదే స్ఫూర్తి : సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిజం అజరామరం, మరో వందేళ్లయిన ఇదే స్ఫూర్తి తేజం ప్రజల్లో ప్రతిబింభిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా అన్నారు. ఖమ్మం కేంద్రంగా రాబోయే డిసెంబర్ 26న జరగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను అట్టహాసంగా జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సీపీఐ స్థానిక, పట్టణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శత వసంత ఉత్సవాలకు 5 లక్షల మంది ప్రజలతో పాటు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు తరలిరానున్నారని తెలిపారు. ఖమ్మం వేదికగా జరిగే ఉత్సవ ముగింపుసభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఆశాభావం వ్యక్తం

చేసారు. సభ విజయవంతం కోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని చెప్పారు. ఈ నేపథ్యంలో జరిగే ప్రచార కార్యక్రమాల్లో సీపీఐ పోరాటాలను, ఉద్యమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సిపిఐ చరిత్రను వివరించాలని సూచించారు. పాలకులుగా కమ్యూనిస్టులను ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని సాబీర్ పాషా తెలిపారు. ఇదే ప్రజా స్ఫూర్తితో సైనికుల్లా శ్రమిస్తే రాబోయే రోజుల్లో రాజ్యాధికారం కమ్యూనిస్టుల చేతుల్లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా నాయకులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీ. పద్మజ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, నిమ్మల రాంబాబు, శ్రీనివాసరావు, చెన్నయ్య, నాగేశ్వరరావు, ఎండీ. అస్లాం, ఉపేంద్ర చారి, రెహమాన్, ఉప్పుశెట్టి రాకేష్, కరీం, మల్లేష్, వాడే లక్ష్మీ, గాలి పద్మ, దాసరి లక్ష్మీ, బిక్కులాల్, జి సత్యనారాయణ, వెంకన్న, బాలాజీ, రామారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకై ఏఐటీయూసీ పోరాటాలు

విశాలాంధ్ర కారేపల్లి: కార్మికుల హక్కుల సాధనకై ఏఐటిసి ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేయటానికి సిద్ధంగా ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ కోరారు. శుక్రవారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎఐటియుసి జెండాను ఆయన స్థానిక ఆటో కార్మికులతో కలిసి ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 లేబర్ కోడ్ల వల్ల కార్మికుల హక్కులకు భంగం వాటిల్లిందని వెంటనే 44 కార్మికుల చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లిందని వెంటనే ఆటో కార్మికులను ఆదుకునేందుకు ఒక్కో ఆటో కార్మికునికి 30000 వేలు డిమాండ్ చేశారు.అన్ని రంగాల కార్మిక రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు.కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి అసంఘటిత కార్మికునికి రూ.26 వేలు వేతనాలు

ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల శ్రీనివాసరావు, తాత వెంకటేశ్వర్లు, నాయకులు అమీర్ జానీ, చెన్నంశెట్టి భూషయ్య,వడ్డే వెంకటేశ్వర్లు,ఆటో యూనియన్ నాయకులు బొమ్మల కృష్ణ,గంగాధరని రవి,బట్టు శ్రీను,బట్టు కుమార్, రేఖ ప్రసాద్,కృష్ణమూర్తి,బట్టు బాలు,కాంచని ఉపేందర్, చిప్పలపల్లి సాగర్,చిలుముల వీరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులను తరిమికొడితేనే కార్మికవర్గానికి మనుగడ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : దేశం నుంచి కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులను తరిమికొడితేనే కార్మికవర్గానికి, ప్రభుత్వరంగ సంస్థలకు మనుగడ ఉంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్ స్పష్టం చేసారు. ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాల్వంచ పట్టణంలోని భవన నిర్మాణ, మున్సిపల్, పెయింటర్స్, హమాలీ, ఫుట్ పాత్

కార్మికుల అడ్డాలు, అమరవీరుల స్మారక స్థూపాల తోపాటు సీపీఐ కార్యాలయంలో ఏఐటియుసి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆవిర్భావ సదస్సులో వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి, నిరంకుశ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనం చేస్తూ కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా మార్పులు చేసారని విమర్శించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా చేసి కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు డి సుధాకర్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నరహరి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు వీ పద్మజ, చెన్నయ్య, గిరి, బిక్కులాల్, కోరే కృష్ణ, శెట్టి చేరాలు, జి రవి, వెంకన్న, కృష్ణ, వెంకటేశ్వర్లు, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

నికోలాస్ పదవీవిరమణ

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి కాలరీసు హెడ్ ఆఫీస్ లో జియం పర్సనల్ (ఆర్ సి) ఉద్యోగపదవి విరమణ చేసారు. ఈ సందర్భంగా శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఆమెకు శాలువా కప్పి, పూలబోకే అందించి ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంతోటి మాట్లాడుతూ నికోలాస్ ఎడ్యుకేషన్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వహించినప్పుడు సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ మొట్టమొదటిసారిగా సీఎండీ బలరామ్ సహాయ సహకారంతో ఏర్పాటు చేయటం జరిగినదన్నారు. దీంతో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఎంతో విద్యాపరంగా మేలు జరిగిందన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్, ఏరియా లైజర్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్, కార్పొరేట్ ఏరియా లైసెన్ ఆఫీసర్ డాక్టర్ మాలతి కొమ్ము, సంఘం వైస్ ప్రెసిడెంట్ దేగల ప్రవీణ్ కుమార్, బీసీ నాయకులు వంగపండ్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

విశాలాంధ్ర ఖమ్మం : పోరాటాలతోనే హక్కులు సాధించబడతాయని ప్రస్తుతం కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు -ఏఐటియుసి పోరాట ఫలితమేనని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లెమెంట్ తెలిపారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులకు మోదీ సర్కార్ తూట్లు పోడుస్తుందని, హక్కులను హరించివేస్తుందని ఆయన ఆరోపించారు. ఏఐటియుసి ఆవిర్భావ -దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మం నగరంలోని పర్ణశాల వద్ద గల ఏఐటియుస్ పైలాన్ వద్ద ఏఐటియుసి పతాకాన్ని -ఆవిష్కరించారు. నగరంలోని పలు కార్మిక వాడల్లో, పారిశ్రామిక ప్రాంతాల్లో ఏఐటియుసి పతాకాలను

ఆవిష్కరించారు. ఏఐటియుసి పైలాన్ వద్ద జరిగిన సభలో క్లెమెంట్ మాట్లాడుతూ 106 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో కార్మికుల పక్షాన నికరంగా పోరాడి హక్కులు సాధించింది -ఏఐటియుసి మాత్రమేనన్నారు. సంఘటిత ఐక్య పోరాటాలే హక్కులను కాపాడతాయని -ఆయన స్పష్టం చేశారు. ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పోరాటాలకు సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

గురుదాస్ దాస్ గుప్తాకు నివాళి

ఏఐటియుసి అగ్రనాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు గురుదాస్ దాస్ గుప్తా ఐదవ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పైలాన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట -రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా నాయకులు పేరబోయిన మోహన్రావు, పెట్టెల మల్లయ్య, ఎండి జాకీరుద్దీన్, గుండెపొంగు మల్లేష్, తాటి నిర్మల, జి. నర్సయ్య, కోటేశ్వరరావు, రావుల శ్రీను, గురవయ్య, మంగీలాల్ -తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : సీపీ

విశాలాంధ్ర ఖమ్మం(క్రైమ్) : రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ అమరవీరులో వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం రూరల్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నేలకొండపల్లి మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి 1,500 మందిపైగా దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారని, ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. తలసేమియా రోగులకు ప్రతి15 రోజులకు ఒకసారి రక్తం అవసరం అవుతుందని, అందు కోసమే అమరవీరుల త్యాగాలకు నివాళిగా ఈ మెగా రక్తదాన శిబిరం ఏర్పాట చేసినట్లు తెలిపారు.ఈ శిబిరాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ఖమ్మం రూరల్, ముదిగొండ, కూసుమంచి, నేలకొండపల్లి మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, సిఐ లు మురళి, రాజు, సంజీవ్,సాగర్, ఎస్ ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదానం శిబిరం

విశాలాంధ్ర - భద్రాచలం : నేటి వేగవంతమైన సమా జంలో రక్తదానం చాలా ప్రాధా న్యత కలిగి ఉన్నను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పట్టణంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖా సేవలు, అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఈ శిబిరంలో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సిఆర్పిఎఫ్ బెటాలియన్ జవాన్లు, పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు, వికలాంగులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఉత్సాహంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట, సిఐ నాగరాజు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఎస్ఐలు సతీష్, శ్యామ్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ ఐ తిరుపతి రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పటేల్ చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడటంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి నేటి తరానికి ఆదర్శం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో కలెక్టర్,ఎస్పీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్‌లో విద్యార్థులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడటంలో సర్దార్ పటేల్ చేసిన సాహసం ఆకర్షమన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ ఉత్సవాలలో భాగంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, 6 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్యస్వామి, అధికారులు, పాల్గొన్నారు.

శేష జీవితం ఆనందంగా సాగాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితం కుటుంబ సభ్యులతో అందంగా గడపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పదవీ విరమణ పొందిన భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావును ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తూ ఆయన పదవీ విరమణ పొందారు. 36 ఏళ్ళ పాటు పోలీస్ శాఖలో సేవలందించిన వెంకటేశ్వరరావును ఎస్పీ కొనియాడారు. డిసిఆర్బి డీఎస్పీ మల్లయ్య స్వామి, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షులు ఏసోబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెట్టుకు ఢీకొన్ని కారు వ్యక్తి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర, దమ్మపేట : దమ్మపేట మండలం పట్వారి గూడెం గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వేగంగా వెళ్తున్న కారు ఆకస్మాత్తుగా నియంత్రణ తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ ప్రమాదంలో వెలుగోటి భాస్కర్ రావు అక్కడికక్కడే మృతి చెందాగా అందులో ప్రయాణిస్తున్న అతని కుమారుడు లక్ష్మణ్‌కు ఇతని స్నేహితులు రవికాంత్, కృష్ణలకు గాయలైయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు సత్తుపల్లి సింగరేణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

పోలీసుల వేధింపులతో నా భార్య ఆత్మహత్య : సోమయ్య

విశాలాంధ్ర- తుంగతుర్తి : దొంగతనం చేసిందని నెపంతో తన భార్య అగు సోమ నరసమ్మ (50) ను ప్రతిరోజు పోలీస్ స్టేషన్లకు పిలిపించి వేధింపులకు గురి చేయడంతో వేధింపులు తాళలేక తన భార్య గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుందని వెంపటి గ్రామానికి చెందిన మృతురాలి భర్త రమణ బోయిన సోమయ్య తెలిపారు. ఈ ఆత్మహత్యకు స్థానిక ఎస్సై క్రాంతి కుమార్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు పెద్దమనుషులు కారణమని తెలిపారు. ఈ మేరకు వారి మీద చర్య తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య ఆత్మహత్యకు ప్రధాన కారణం ఎస్సై వేధింపులే కారణమని తెలిపాడు. తన సోదరుడైన మల్లయ్య ఇంట్లో తన భార్యబంగారం దొంగతనం చేసిందని తన భార్యను గత రెండు రోజులుగా స్టేషన్‌కు పిలిపించి బలవంతంగా ఒప్పుకోవాలని వేధించినట్లు తెలిపారు. గత 15 రోజుల క్రితం తన భార్య అగు సోమ నర్సమ్మ (50) బావ మల్లయ్య ఇంటిలో బంగారం పోయిందనే నెపంతో సోమ నర్సమ్మ పై తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో తన అన్న మల్లయ్య ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో వెంపటి గ్రామానికి చెందిన కొంతమంది పెద్దమనుషులు, తన అన్న మల్లయ్య కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి తన భార్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలుమార్లు ఫిర్యాదు చేయగా పోలీసులు, తన భార్యను స్టేషన్‌కు తీసుకువచ్చి ఉదయం నుండి రాత్రి 8 గంటల వరకు తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో ఇంటికి పంపకుండా ఉంచినట్లు తెలిపారు . ఎస్సై క్రాంతికుమార్ కనీసం మహిల అని కూడా చూడకుండా, వేధింపులకు గురిచేసి, నిన్ను జైలుకు పంపుతాం, నీవే దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని నీ ఫింగర్ ప్రింట్స్ ఉన్నాయని కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన తన భార్య రాత్రికి రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. తన భార్య మృతికి కారణమైన ఎస్సై తో పాటు గ్రామానికి చెందిన పెద్దమనుషులపై చట్టరీత్య చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

పోలీసు అమరవీరులు స్మారక వారోత్సవాల 2కె రన్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల ముగింపు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ పట్టణ పోలీసులు భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఎక్తా దివాష్ అను సందేశంతో రన్ ఫర్ యూనిటీ అనే నినాదంతో 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ పోలీసులు పిలుపునివ్వగా పట్టణ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పోలీస్‌లు నిర్వహించిన ఈ (2కె రన్) స్థానిక ఠాగూర్ స్టేడియం నుండి మొదలై సూపర్ బజార్ మీదుగా కోదండ రామాలయం వద్ద గల ఆంజనేయుడి విగ్రహం వరకు కొనసాగింది, ఈ 2కె రన్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరు దారి పొడవునా రన్ ఫర్ యూనిటీ అను నినాదం చేస్తూ ఎంతో ఉత్సహంగా,ఉల్లాసంగా పెరుగెత్తారు. అనంతరం స్థానిక పట్టణ ఎస్సై. రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు, స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో 500లకు పైగా సంస్థానాలను విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించి భారతదేశ ఉక్కు మనిషిగా ప్రఖ్యాతిగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రన్ ఫర్ యూనిటీ అను నినాదంతో రామకృష్ణాపూర్ పోలీస్ వారి ఆధ్వర్యంలో (2కె రన్) లో పట్టణ ప్రజలు,అన్నీ రంగాల ప్రముఖులు,వివిధ శాఖల ఉద్యోగస్తులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయ మిత్రులు. యువతి-యువకులు, ముఖ్యంగా విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై రాజశేఖర్ పోలీస్ డిపార్ట్మెంట్ తరుపున అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ కృషి : బిక్షపతి

విశాలాంధ్ర-తొర్రూర్ : కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు ఓమా బిక్షపతి అన్నారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకుని ఏఐటీయూసీ తొర్రూర్ మండల సమితి ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద ఉన్న కార్మిక జెండాను ఏఐటీయూసీ సీనియర్ నేత ఓమా బిక్షపతి ఎగురవేశారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అద్వితీయమైన కృషి చేసి, అసాధారణ త్యాగాలు, బలిదానాలు, పోలీసు దాష్టీకాలు,పెట్టుబడుదార్ల గూండాల దాడులు, యావత్ జీవిత శిక్షలు, మరణ దండనలతో ఏఐటీయూసీ చరిత్ర యావత్తు ఎరుపెక్కిందన్నారు. కోట్లాది మంది కార్మికవర్గ గొంతుకగా వారి గుండెల్లో స్థానం సంపాదించుకుందని, ఏఐటీయూసీ ఒకానొక చారిత్రక నేపథ్యంలో ఏర్పడిందని వారు కొనియాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. దీనిని ఖచ్చితంగా కార్మిక లోకం వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల ప్రభాకర్,సహాయ కార్యదర్శి ఘనపురం లక్ష్మణ్,పేరబోయిన కిరణ్ కుమార్, ముద్రబోయిన వెంకన్న, సూరబోయిన వీరన్న, బొల్లు వెంకన్న, మంగళపల్లి చంద్రయ్య, అనిల్, కత్తుల కుమార్, బొల్లు శీను, యాకయ్య, కుమారస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడులను రద్దు చేయాలి: మాసన్న

విశాలాంధ్ర-వనపర్తి : కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం తెచ్చిన లేబర్ కోడులను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసన్న డిమాండ్ చేశారు. వనపర్తి స్నేహ ఫుట్పాత్ వర్కర్స్ కేంద్రం ఏఐటీయూసీ 106 ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అరుణ పతాకాన్ని మాసన్న ఆవిష్కరించి మాట్లాడుతూ.. గతంలో కార్మికులు రోజుకు 16 గంటల నుంచి 18 గంటలు పనిచేసే వారన్నారు. ఏఐటీయూసీ పోరాటం ఫలితంగా పని దినం ఎనిమిది గంటలకు తగ్గించారన్నారు. లేబర్ కోడ్ల అమలులో భాగంగా కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మెహక్కును హరించే కుట్ర చేస్తున్నారని, పని దినం 12 గంటలకు పెంచుతున్నారన్నారు. కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని పోరాడుతున్న చలనం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిన అమలు కావటం లేదన్నారు. కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ పోరాడని అంశం లేదన్నారు. లేబర్ కోడులకు వ్యతిరేకంగా పోరడాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనం కోసం ఏఐటీయూసీలో చేరి పోరాడాలి అన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి భాస్కర్, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం నేతలు ఎర్రకుర్మయ్య చిన్న కుర్మయ్య శాంతన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మికు పితృవియోగం

విశాలాంధ్ర ఖమ్మం : కొత్తగూడెం మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తండ్రి కల్లూరు మున్సిపాలిటీ వాస్తవ్యులు సత్యనారాయణ మరణవార్త తెలిసి బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. సత్యనారాయణ మరణం బాధాకరమని పేర్కొన్న నామ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం కలిగించాలని ప్రార్థించారు.

సంపాదకీయం

ఎంత నష్టం... ఎంత కష్టం!

మొంథా తుపాను వచ్చింది...తీరాన్ని తాకి, తీరిగ్గా వెళ్లిపోయింది... కానీ అది సృష్టించిన విధ్వంసం అన్నదాతను తీవ్రంగా దెబ్బతీసింది. పైగా ఆంధ్రప్రదేశ్‌లో మారిన నిబంధనల వల్ల పంటల బీమా పథకం ఆశలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో రైతన్న కుదేలయ్యే పరిస్థితి దాపురించింది. మూడు నాలుగు రోజులపాటు రాష్ట్రాన్ని కకావికలం చేసిన మొంథా తుపాను రాష్ట్ర వ్యాప్తంగా 1,583 గ్రామాలను ప్రభావితం చేసింది. 1.38 లక్షల హెక్టార్లలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, అందులో ఒక్క కృష్ణాజిల్లాలోనే 46 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని స్వయంగా ప్రభుత్వమే చెపుతోంది. యావత్ తీరప్రాంతంలో వరి పైరు పాలు పోసుకునే దశ, ఈనిన దశలో ఉండటంతో వరికి భారీ నష్టం కలిగింది. వరి తర్వాత పత్తి, మొక్కజొన్న, మినుము పంటలను రైతులు అత్యధికంగా కోల్పోయారు. మొంథా తుపాను వల్ల మొత్తంగా రాష్ట్రానికి 5,265 కోట్ల రూపాయల మేరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ప్రకటించగా, అందులో వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.39 కోట్లు, పట్టుపరిశ్రమకు రూ.65 కోట్లు, ఆక్వాకు రూ.1270 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.2,079 కోట్లు, పురపాలక శాఖకు రూ.109 కోట్లు, జల వనరుల విభాగానికి రూ.207 కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.8 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.16 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.71 లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం లెక్కలు తేల్చింది. కాకపోతే, రైతుకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలమైనట్లుగా విమర్శలున్నాయి. కృష్ణా, గోదావరితో సహా ఇతర నదులన్నీ పొంగిపొర్లుతున్న నేపథ్యంలో వరద ముప్పు పొంచి ఉంది. తెలంగాణలో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ నీరంతా కృష్ణా, గోదావరి నదుల్లో కలవడంతో వాటి ప్రవాహం పోటెత్తుతోంది. ఇప్పటికే ప్రకాశం బ్యారేజీ వద్ద ఎగువ నుంచి 5,66,860 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. పులిచింతల నుంచి 3,82,295 క్యూసెక్కులు, పాలేరు నుంచి 23,967, కీసర నుంచి 96,244 క్యూసెక్కుల వరద నీరు వచ్చిపడింది. ఒక్క మునేరుకే ఎగువ నుంచి 1,49,946 క్యూసెక్కుల నీరు వచ్చి పడుతోంది. గోదావరి, నాగావళి, వంశధార పరిస్థితీ ఇలాగే ఉంది. ఈ వరద ఇంకెంత నష్టాన్ని మిగుల్చుతుందో అంచనాకు అందడం లేదు. ఇలాంటి సమయంలో రైతులకు ప్రభుత్వం అందించే చేయూత అతిముఖ్యమైనది. డ్రోన్లు వాడినా, డేటాబేస్ ఆధారంగా ఆథార్ అథెంటికేషన్‌తో ప్రతి ఇంటికీ జియోట్యాగింగ్ చేసినా...ఇప్పటి వరకైతే రైతులకు సాయం అందిస్తారా లేదా అన్నది ప్రభుత్వం ఇంకా తేల్చలేదు. సర్కారు సాయం పక్కనబెడితే, పంటల బీమా పథకం వర్తించినా, రైతు పరిస్థితి కాస్త కుదటపడుతుందేమో. కానీ గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేయడంతో బీమా ప్రీమియం కట్టిన రైతుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. దీంతో రైతుకు నష్టపరిహారం ప్రశ్నార్థకంగా మారడం బాధాకరం. భారత్‌లో పంటల బీమా పథకం పేరుకైతే అమల్లోనే ఉంది. కాకపోతే నిధులు విదల్చడంలో మోదీ సర్కారు వింతపోకడ బాధిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమైన పథకం 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' (పీఎంఎఫ్‌బీవై). ప్రకృతి వైపరీత్యాలు (అతివృష్టి, అనావృష్టి, తెగుళ్లు, వ్యాధులు) కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడం దీని పరమోద్దేశం. రైతులు చాలా తక్కువ ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది, మిగిలిన ప్రీమియం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. నష్టపరిహారం చెల్లింపులో పారదర్శకత కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగిస్తున్నారు. ఈ పథకం చాలా సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా అమలు అవుతోంది. అయితే కొన్ని రాష్ట్రాలు తమ సొంత విధానాలను కూడా అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఈ పథకానికి మార్పులు చేసి, సొంతంగా అమలు చేశాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా 'ఉచిత పంటల బీమా' పథకం అమలు చేశారు. ఆ తర్వాత వచ్చిన కూటమి సర్కారు 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం' రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వ 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పథకాన్నే అమలు చేస్తున్నది. 2024 ఖరీఫ్ సీజన్ నుంచి ఇది మొదలైంది. ఈ విధానం ప్రకారం, రైతులు తమ పంటలకు నిర్ణీత ప్రీమియం వాటాను స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ప్రీమియం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. ఖరీఫ్‌లో ఆహార ధాన్యాలు, నూనెగింజల పంటలకు రైతు దాదాపు 2% ప్రీమియం చెల్లించాలి, రబీకి 1.5% చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంలో, జిల్లాల్లో నోటిఫై చేసిన పంటలకు రైతులు పంట వేయకముందే బీమా చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 'ఈ-క్రాప్'లో నమోదు తప్పనిసరి. వైసీపీ అమలు చేసిన 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం' ప్రకారం, రైతులపై ప్రీమియం భారం లేకుండా, ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేది. ఈ పథకం కొన్ని పంటలకు పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాలతో, మరికొన్నింటికి రాష్ట్రం సొంతంగా వాతావరణ ఆధారిత బీమా పథకం (డబ్ల్యుబీసీఐఎస్) ద్వారా అమలు చేసింది. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో రైతులు తమ పంటలకు బీమా కావాలంటే, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నిర్ణయించిన తమ వాటా ప్రీమియంను తప్పనిసరిగా చెల్లించాల్సిందే. అందుకే, ఏపీలో పంటల బీమా పథకం అమలు సందిగ్ధంలో పడింది. 2024 సీజన్ ముగిసి ఏడాది అవుతున్నా ఫసల్ బీమా యోజన ప్రీమియంలో కేంద్రం తన వాటా ఇంకా చెల్లించనేలేదు. రైతులు తమ వాటా కింద రూ.60.19 లక్షలు చెల్లించినా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.304 కోట్లు చెల్లించినా, కేంద్రం మాత్రం తన వాటా కింద ఇవ్వాల్సిన రూ.304 కోట్లలో కేవలం రూ.50 కోట్లే చెల్లించి చేతులు దులుపుకుంది. రైతుల సంక్షేమం పట్ల మోదీ సర్కారు చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లమైంది. పాత సీజన్‌కే దిక్కులేకపోతే, 2025 సీజన్ గతేంటి? 2025 సీజన్ కోసం నోటిఫై చేసిన 26 జిల్లాల్లో రైతుల నుంచి 12 లక్షల దరఖాస్తులు అందగా, వారిలో సగం మందే ప్రీమియం చెల్లించారు. వాతావరణ ఆధారిత బీమా విషయంలోనూ 3 లక్షల మంది రైతులే ప్రీమియం చెల్లించారు. కేంద్రం నిధులు ఎగ్గొట్టడం రైతులపై చిన్నచూపు చూడటమే. ఇదొక ఎత్తయితే, వైసీపీ ఉచిత బీమా స్థానంలో రైతులు, కౌలు రైతుల కోసం సమగ్ర పంటల బీమా పథకం తెస్తామని చెప్పిన కూటమి చివరకు దాన్ని తుంగలోతొక్కి, మోదీ ఒత్తిడితో కేంద్ర పథకానికే గ్రీన్‌సిగ్నలిచ్చింది. దాని అమలుకు అతీగతీ లేదు. ఇన్ని లొసుగుల నేపథ్యంలో 'డబుల్ ఇంజిన్' సర్కారు మొంథా బాధిత రైతులకు సాయం అందిస్తుందన్నది సందేహమే!

సమాజానికో చుక్కాని స్టాలిన్



డాక్టర్ కె. నారాయణ
ఛైర్మన్, సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్

సీనియర్ కమ్యూనిస్టు బొప్పూడి స్టాలిన్ బాబు మరణం బాధాకరం. వ్యక్తిగతంగా ఆయన జీవితంలో అపకీర్తులు లేవు. అన్నీ మంచి అలవాట్లే. యువతకు ఆయన ఆదర్శం. ఆయన ఆదర్శ భావాలను యువత అలవర్చుకోవాలి. ఉద్యమంలో చురుకయినపాత్ర, ఉద్యమం ఉద్యమంగా కాకుండా పార్టీకి ప్రయోజనాత్మకంగా ఎలా మలుచుకోవాలి? ఆ ఉద్యమ స్వరూపమేమిటి, అందులో పాల్గొంటున్న వారెవరు? వారు ఏ కోవకు చెందినవారు, వారి కుటుంబ నేపథ్యమేమిటి? వ్యక్తిగత అలవాట్లేమిటి? ఏదైనా బలహీనతలున్నాయా? ఉంటే వాటిని సరిచేయడానికి అవకాశాలున్నాయా? యితరేతర కారణాలు కూడా పరిశీలించే వారు. ఒకవిధంగా చెప్పాలంటే మంచి కార్యకర్తగా అతనికి అతనే సాటి. సుగుణాలున్న కార్యకర్త కోసం ఎంతయినా శ్రమించే వారు. వ్యక్తిగత విషయాలు కూడా తెలుసుకుని తగిన సలహాలు యిచ్చి విశ్వాసం కల్పించేవారు. ఆనాడు గుంటూరులో విద్యార్థి ఉద్యమానికి రౌడీ మూకలు అడ్డుతగిలేవి. వారిని ఎదుర్కోడానికి మేమంతా సైనికుల్లాగ కదనరంగంలోకి దూకినా, స్టాలిన్ మంచి వ్యూహం రూపొందించేవారు. పథకాలు రూపొందించడంలో ఆయన దిట్ట. కార్యకర్తల్ని తయారు చేయడంలోనూ, నాయకత్వ స్థాయి పెంపొందించడంలోనూ బాగా కృషిచేసేవారు.

వాస్తవానికి నాకు రాజకీయాల వాసనే పడేది కాదు. తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో నగరి వద్ద ఆయనంబాకం గ్రామానికి చెందినవాడిని. గుంటూరు భాష, అలవాట్లకు, చిత్తూరు జిల్లా అందులో తమిళ భాషా ప్రభావం నుంచి వచ్చిన వాడిని అయిన నాకు కొంచెం ఇబ్బందిగానే ఉండేది. నేను ఆయుర్వేద కాలేజీలో చేరాను. దానికి కారణం నగరిలో పేరుపొందిన ఆయుర్వేదిక్ డాక్టర్ రామచంద్రరాజు. వారికి నగరి, పుత్తూరు, తిరుత్తణి (తమిళనాడు) లలో హాస్పిటళ్లు ఉండేవి. వారానికి రెండురోజుల లెక్కన హాస్పిటళ్లకు వెళ్లేవారు. ఆదివారం విశ్రాంతి. ఆయనకు పిల్లలు లేరు. మా కుటుంబానికి సన్నిహితులు. నగరి హైస్కూలు, తదనంతరం పీయూసీ మదనపల్లిలో అయిపోయాక రామచంద్రరాజుగారితో మాట్లాడే సందర్భంగా అప్పుడే పేపర్లో "గుంటూరు ఆయుర్వేదిక్ కాలేజీలో బీఏఎంఎస్ డిగ్రీ కోర్స్ ప్రకటించారు. ఆ ప్రకటన చూసి వెంటనే డాక్టర్ గారు నన్ను గుంటూరుకు వెళ్లి ఆయుర్వేదిక్ కాలేజీలో చేరు, నా తదనంతరం ఈ మూడు హాస్పిటల్స్ చూసుకోవచ్చు అని పురమాయించి మా నాన్నగారికి చెప్పి నన్ను గుంటూరు పంపారు. ఆ లక్ష్యంతో గుంటూరు రావడం ఆయుర్వేదిక్ కాలేజీలో చేరడం జరిగిపోయింది. ఆయుర్వేదిక్ కాలేజీలో ఎక్కువమంది విద్యార్థులు బ్రాహ్మణులు. కాలేజీ ఎన్నికలు జరిగితే మా గ్రూపే గెలిచింది ఓడిపోయిన గ్రూప్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అనుకూలురని తెలిసింది. అనుభవంలేని నాకు మైక్‌లో మాట్లాడటమే రాదు. ఏఐఎస్ఎఫ అనుకూలురులో ర్యాలీప్రసాద్ గోదావరి జిల్లావాడు. అప్పటికే ఏఐఎస్ఎఫ్ కార్యకర్త. విద్యార్థి సంఘం సమావేశం అయినాక ర్యాలీ ప్రసాద్‌తో " ఏంటయ్యా అట్లా మాట్లాడుతావ్ మీ నాయకులిట్లే సలహాలిస్తారా? ఎవరు మీ నాయకులు" అని నిలవేశాను. అప్పుడు ప్రసాద్ "మా నాయకులను కలుస్తావా" అన్నాడు.

యిక వెనకడుగు వేయకూడదు గదా, సరే అని బ్రాడీపేట 4 వ లైన్ ఏఐఎస్ఎఫ్ కార్యాలయానికి వెళ్లాం. అక్కడ పొడవాటి వ్యక్తి చూడచక్కగా వున్నారు వారే స్టాలిన్ బాబు, ఆ పక్కనే కళాకారుడు మల్లెపూవులాంటి పంచెతో చూడచక్కగా ఉన్నారు నల్లూరి వెంకటేశ్వర్లుగారు.

నేను చిత్తూరు భాషతో "ప్రసాద్‌కు నీవిట్లాగే ట్రయినింగ్ యిచ్చావా" అని నిష్టూరంగా మాట్లాడాను. స్టాలిన్ నాతో కూర్చో బ్రదర్ అని మాటల్లో దింపారు, ర్యాలీప్రసాద్‌నే మందలించినట్టు మాట్లాడారు. అది ఎత్తుగడలే కావచ్చు అప్పటి నుంచి నా కోసం కాలేజీకి, కొరిటిపాడులో నేనున్న రూమ్‌కు తరచురావడం, అరండల్‌పేట ఇస్కస్ కార్యాలయం వద్దనున్న మార్వాడీ స్వీట్ షాపులో వెన్నుండలు తినిపించేవారు. నాకు మిత్రులంటే చాలా యిష్టం. రాజకీయాలకన్నా స్నేహానికే ప్రాధాన్యతనిస్తూ ఏఐఎస్ఎఫ్ కార్యక్రమాలకు తీసుకెళ్లడానికి ప్రయత్నించే క్రమంలో ఆళ్ల నాగేశ్వరరావును పూరాయించే వారు. నన్ను లైన్‌లో పెట్టడానికి చాలా కష్టపడ్డారు. చివరికి వారి స్నేహంతోపాటు విస్తృతస్థాయి మిత్రబృందం ఏర్పడింది, దీనికి కొరిటిపాడులో ఉన్న రూమ్ కూడా ఉపయోగపడింది. యిదంతా చెప్పడానికి కారణం "మట్టిముద్దను తెచ్చి శిల్పంగా తయారుచేసిన శిల్పాన్ని నేను. ముడిసరుకుగా గుంటూరు వచ్చి తయారయిన వస్తువుగా ఉద్యమానికి అప్పగించిన శిల్పి స్టాలిన్‌బాబు దానికి మరుద్వతిగారి ప్రేమానురాగాలు తోడయ్యాయి. నాలాంటి ఉద్యమకారులను పదుల సంఖ్యలో తయారు చేశారు.

రాష్ట్రంలోనే సమరశీల టీమ్ తయారయింది. ఇంతలో రాష్ట్ర పార్టీ ఆదేశం మేరకు ఈ టీమ్ నుంచి నన్ను మా సొంతజిల్లా అయిన తిరుపతికే వెళ్లి పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణం చేయమని నిర్ణయించింది. అయితే ఇక్కడ చేదునిజం చెప్పాల్సి వస్తున్నది. బూర్జువా పార్టీలలో రాకపోకలు సహజం, కమ్యూనిస్టు ఉద్యమాలలో ఒక స్థాయికి చేరిన కార్యకర్తలు గానీ నాయకులుగానీ ఉద్యమానికి ఏ కారణం చేతన్న దూరమయితే సమాజానికి, నమ్మిన ఆశయాలకు, చివరికి వ్యక్తులకు తీరని ఆవేదన, నష్టం కలుగుతుంది. ఒక ఉద్యమానికి అంకితమయ్యాక ఆ ఉద్యమమే పరమావధిగా ఉండాలే తప్ప మార్గమధ్యమంలో అడ్డొచ్చే తుంపర అడ్డురాకూడదు. స్టాలిన్‌బాబు జీవితం మొత్తం విశ్లేషిస్తే సమాజానికో చుక్కాని, కార్యదీక్షత, పట్టుదల, అంకితభావానికి ప్రతిబింబం.

అలాగే నేననుకున్నదే మంచిది అని నిర్ధారించుకోవడం (సెల్ఫ్ జడ్జిమెంట్) కుదరదు.

(స్టాలిన్‌బాబు సంతాపసభ నేడు గుంటూరులో జరుగుతున్న సందర్భంగా...)

పరిశ్రమల పేరుతో రైతుల భూములకు ఎసరు

బొల్లిముంత సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ఏ ప్రభుత్వమైనా బడా పారిశ్రామికవేత్తలకు భూములు కట్టబెడుతూనే ఉన్నాయి. నేడు చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం పరిశ్రమాధిపతులకు ఎంతో విలువైన భూములను అప్పగిస్తూ నిర్ణయాలు తీసుకోవడంలో దేశంలోనే ముందు ఉన్నది. ప్రజల మనుగడకు భూమి ఆధారం. భూమికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి భూమి ప్రజల వద్దే ఉండాలి తప్ప దోపిడీదారుల పరం కాకూడదు. ఎంతోప్రాధాన్యత ఉన్న భూమిని రైతాంగం నుంచి పాలకులు దూరం చేస్తున్నారు. ఇప్పటి వరకు పాలించిన, పాలిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ ప్రయోజనాలను పక్కనపెట్టి బడా పారిశ్రామిక వేత్తల, విదేశీ సంస్థల దోపిడీ ప్రయోజనాల కోసం భూమిని వినియోగించే విధానాలు అమలు జరుపుతున్నారు.

బ్రిటిష్ వలస పాలకులు తమ అవసరాలకోసం నిర్మించే రైల్వేల నిర్మాణం కోసం, ఇతర ప్రాజెక్టులకు భూ సేకరణ కోసం 1870లో భూ స్వాధీన చట్టం చేశారు. ఈ చట్టం రైతాంగ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటంతో వ్యతిరేకత వ్యక్తమైంది. అలాంటి పరిస్థితుల్లో 1894లో మరొక భూ సేకరణ చట్టాన్ని వలస పాలకులు చేశారు. ఈ చట్టంలో పునరావాసం (ఆర్అండ్ఆర్) గురించి ఎటువంటి ప్రస్తావన లేక పోవటం వల్ల బాధిత కుటుంబాలకు ఆశ్రయం, ఉద్యోగాలు, జీవనోపాధి లేకుండా పోయింది. భూమికి ఇచ్చే పరిహారం కూడా ప్రభుత్వ ఇష్ట ప్రకారం నిర్ణయించడం వల్ల చాలా తక్కువ పరిహారం లభించేది. ఈ చట్టం కూడా రైతాంగ వ్యతిరేకమైనదే. అధికార మార్పిడి తర్వాత ఏర్పడిన ' స్వతంత్ర ' పాలనలో కూడా 2013 దాకా 1894 భూసేకరణ చట్టాన్ని అనుసరించే దేశంలో భూసేకరణ, పరిహారం అమలు జరుగుతూ వచ్చింది. వలసపాలనలో చేసిన ఈ చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టం చేయాలని రైతాంగం, రైతు సంఘాలు, ప్రజాతంత్ర వాదులు డిమాండ్ చేయడంతో ఆ నాటి యూపీఏ ప్రభుత్వం 2013లో మరో భూసేకరణ చట్టం చేసింది. ఈ చట్టానికి 1894 చట్టమే ఆధారంగా ఉంది. ఈ చట్టంలో న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించడం, ప్రభుత్వం భూమిని సేకరించే ముందు సామాజిక ప్రభావ అంచనాను పరిగణలోకి తీసుకోవటం, పబ్లిక్- ప్రైవేట్ భాగస్వామ్యంతో కూడిన ప్రాజెక్టులకు భూమిని సేకరించడానికి ప్రభావిత కుటుంబాల్లో కనీసం 70% కుటుంబాల ముందస్తు అనుమతి తప్పనిసరి, పట్టణ ప్రాంతంలో తీసుకునే భూమికి, భూమి విలువకంటే రెట్టింపు, గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు రెట్లు ఎక్కువ పరిహారం ఇవ్వాలని చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టంలో కూడా పరిహారం పెంపు, ముందస్తు అనుమతి, పునరావాసం గురించి పేర్కొన్నారే తప్ప భూసేకరణకు రైతు అనుమతి గురించి ప్రస్తావన లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో రైతుల భూములను ఈ చట్టం ద్వారా కట్టబెడుతుంది. గ్రామ సభల తతంగం ఎలాంటిదో ప్రజలకు బాగానే అనుభవం ఉంది. అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లో తమకు అవసరమైన భూమిని పారిశ్రామిక వేత్తలు రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. ప్రభుత్వాలు సేకరించవు. అలాంటి విధానాన్ని భారత పాలకులు ఎందుకు అమలు జరపరు.

బడా పారిశ్రామిక వేత్తలకు భూములు కేటాయించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో కొనసాగుతున్నది. 1894 చట్టాన్ని అనుసరించి 2013 దాకా భూసేకరణ కొనసాగింది. ఈ చట్టాన్ని అనుసరించే 2005లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండల్ల (సెజ్) చట్టం చేసి పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల రైతుల, పేదల అసైన్డ్ భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టింది. సెజ్ చట్టం నయా భూ ఎస్టేట్‌దారుల ఏర్పాటుకి దారి తీసింది. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం కూడా సెజ్‌ల పేరుతో పారిశ్రామిక వేత్తలకూ భూములు కేటాయింపు కొనసాగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో భూ కేటాయింపుల విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, గత 13 సంవత్సరాల్లో పెద్దఎత్తున భూములు ఇచ్చారు. ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలకు 1,82,270 ఎకరాలను కేటాయించారు. వీటి విలువ లక్ష కోట్ల రూపాయలు. భూ కేటాయింపుల్లో ఎక్కువ భాగం ఏపీఐఐసీదే. పరిశ్రమలు, కంపెనీల స్థాపన, ల్యాండ్ బ్యాంకు పేరిట ఏపీఐఐసీకి 64,788 ఎకరాలు కేటాయించారు. ఈ భూములను పరిశ్రమల స్థాపన పేరుతో తక్కువ ధరకు పరిశ్రమాధిపతులకు కేటాయించారు. ఇవి కాకుండా సోలార్, విండ్, ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం 42,084 ఎకరాలు కేటాయించింది.

2014 ఎన్నికల్లో విజయం సాధించాక చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటీకరణ విధానాలను అమలు జరిపింది. బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచంలోనే గొప్ప రాజధాని పేరుతో, దేశ, విదేశీ బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకు 34 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతుల నుంచి తీసుకున్నది. 2019 ఎన్నికల్లో గెలుపొందిన వైసీపీ ప్రభుత్వం కూడా పెట్టుబడిదారీ అనుకూల విధానాలను అమలు చేస్తూ, పారిశ్రామిక వేత్తలకు భూములు కేటాయించింది. 2024లో మరోసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు పెద్ద ఎత్తున భూసేకరణ ప్రారంభించాడు. భూ సేకరణ వల్ల భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందని గత ల్యాండ్ పూలింగ్ మాదిరిగా రైతుల నుంచి మరో 44 వేల ఎకరాలను సేకరిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించాడు. దీనిపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇవి కాక ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ప్రకారం ఏపీలో లక్షా 4 వేల ఎకరాలకు పైగా భూమి ల్యాండ్ బ్యాంకుల్లో ఉంది. అనేక రాష్ట్రాల్లో 500 లేక 1000 ఎకరాల్లో మంచి రాజధానుల ఏర్పాటు జరిగింది. ఏపీలో రాజధాని కోసం లక్ష ఎకరాల సేకరణ ఎందుకు ?. ఈ భూములను పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టటానికే గదా! కూటమి ప్రభుత్వం అతి చౌకగా రాజధాని అమరావతిలో వివిధ సంస్థలకు భూములు కేటాయిస్తూ మార్చి 2025న ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రుల బృందం సిఫార్సుల మేరకు ఈ కేటాయింపులు జరిగాయి. గెయిల్, అంబికా సంస్థలకు గతంలో ఇచ్చిన భూ కేటాయింపులు రద్దు చేసి కొత్తగా ఏడు సంస్థలకు 34.4 ఎకరాలను 60 సంవత్సరాల పాటు లీజు ప్రాతిపదికన కేటాయిస్తున్నట్లు వెల్లడించింది. అమరావతిలో భూ కేటాయింపులతో పాటు విశాఖపట్నంలో బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌కు 70 ఎకరాలు, ఐటి టవర్ నిర్మాణం కోసం ఎల్అండ్‌టి సంస్థకు 10 ఎకరాలు కేటాయింపులు జరిగాయి. మధురవాడలో ఎంతో విలువైన భూమిని ఎకరా కోటి చొప్పున 3.6 ఎకరాలను ఐటీసెజ్ కోసం కేటాయించారు. సత్య డెవలపర్స్ అనే సంస్థకు విశాఖ మధురవాడలోనే ఎకరా కోటి చొప్పున 30 ఎకరాలు చంద్రబాబు ప్రభుత్వం కేటాయించింది. పరదేశీపాలెంలో ఎకరా 50 లక్షలకు సీఫీ టెక్నాలజీ సంస్థకు కేటాయించింది. ఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ సంస్థకు ఐటీ సెజ్ కోసం ఎకరా 99 పైసలకు 10.29 ఎకరాలను కేటాయించింది. లులు గ్రూపుకి నామ మాత్రపు ధరకు విశాఖలో 13.83 ఎకరాలను 99 సంవత్సరాలకు లీజుకి ఇచ్చింది. ఇదే గ్రూపుకి విజయవాడలోని 4.15 ఎకరాలను కేటాయించింది. ఇంకా అనేక సంస్థలకు భూ కేటాయింపులకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రస్తుతం ఆమోదం పొందిన సెజ్‌లు 30 ఉన్నాయి. 2005 సెజ్ చట్టానికి అనుగుణంగా సెజ్‌లకు ఇచ్చిన భూముల్లో అత్యధికం వినియోగంలో లేవు. ఉమ్మడి విశాఖ జిల్లా అచ్యుతాపురంలో టెక్స్‌టైల్ సెజ్‌కి ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలు వైఎస్ఆర్ ప్రభుత్వం ఇచ్చింది. ఇందులో ఇప్పటికీ 510 ఎకరాలు వినియోగంలో లేవు. పరవాడలో నోటిపై అయిన ఫార్మాస్యూటికల్స్ సెజ్‌కి కేటాయించిన 607 ఎకరాల్లో 440 ఎకరాలు వినియోగంలో లేదు. శ్రీ సిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన మల్టీ ప్రొడక్ట్ సెజ్‌కి కేటాయించిన 842 ఎకరాల్లో 537 ఎకరాలు, నెల్లూరు జిల్లా టెక్స్ టైల్ అపెరల్ చెందిన మ్యానుఫ్యాబ్రిక్స్ పార్క్‌కి ఇచ్చిన 587 ఎకరాల్లో 32 ఎకరాలు మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. అనంతపురం జిల్లాలో నాలెడ్జ్ పార్క్ కి ఇచ్చిన 915 ఎకరాలు ఇంత వరకు వినియోగంలోకి రాలేదు. కాకినాడ సెజ్‌కి 10 వేల ఎకరాలకు పైగా భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. రైతులకు చెందిన 2,118 ఎకరాలను కూటమి ప్రభుత్వం తిరిగి ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ భూములు రైతాంగానికి తిరిగి ఇవ్వటానికి వైసీపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మిగతా భూముల గురించి వైసీపీ, కూటమి ప్రభుత్వాలు ఏమి చెప్పలేదు. ఈ సెజ్ ముందుకు సాగలేదు. ఇంకా అనేక సెజ్‌ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. సెజ్‌ల నిమిత్తం టీడీపీ ప్రభుత్వం 2018లో 18,242 ఎకరాలను కేటాయించింది. ఇందులో 7,355 ఎకరాలు మాత్రమే వినియోగించారు. సెజ్‌ల పరిస్థితిని గమనిస్తే, సెజ్ యజమానులు ప్రభుత్వం ఇచ్చిన భూములను, రాయితీలను దుర్వినియోగం చేశాయనే వాస్తవం బయట పడింది. రైతులు మాత్రం భూములు కోల్పోయారు. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతాంగ వ్యతిరేక విధానాలనే అమలు జరుపుతున్నాయి. సెజ్‌లు, పరిశ్రమల పేరుతో రైతుల, ప్రభుత్వ భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నాయి.

సెల్:9885983526

పోస్టు చేయని పుస్తకం

మంత్రిగారి ఇంటి దగ్గర కోలాహలంగా ఉంది. చేతిలో పుస్తకాల కట్టలతో కొందరు... భుజాన సంచుల్లో ఇంకొన్ని పుస్తకాలతో మరికొందరు గేటు దగ్గర నిలబడి "పోస్టల్ పార్సెల్ సర్వీస్‌లు పునరుద్ధరించాలి. కవులకు, రచయితలకు ఆర్థిక భారం తగ్గించా"లంటూ ఏవేవో నినాదాలు చేస్తున్నారు. అప్పుడే లోపలి నుంచి వచ్చిన మంత్రిగారు వాళ్ల వైపు చాలా చిరాగ్గా చూశారు. ఓ నలభై, ఏభై సెకన్ల తర్వాత పక్కనే ఉన్న పీఏ కేసి చూశారు. ఏటిదంతా అన్నట్లుగా ఉంది ఆ చూపు. ఆ చూపులో లోచూపుని అర్థం చేసుకున్న పీఏ కాసింత కంగారు పడ్డాడు. ఆ తర్వాత...

\- - -

"మీరలా ఉండండి మంత్రిగారు. నే మాట్లాడతా వీళ్లతో... "

"ఏంటయ్యా మీ గొప్ప! పెద్ద రచయితలు, కవులు అయితే మాత్రం మీకు అన్ని వసతులు కల్పించాలా!? మీరు రాసిన కవిత్వాలు, కథలు, కాకరకాయలు ఇంకొకళ్లకి పంపించుకుంటూంటే ప్రభుత్వం పోస్టలు ధరలు పెంచేసిందా...! ఎన్నో దశాబ్దాలుగా ఇస్తున్నారు కదా ప్రభుత్వం వారు ఇన్ని సౌకర్యాలు. ఇప్పుడు ఆపేసింది. ఈ మాత్రానికే గింజేసుకోవాలా...!? మీరు పుస్తకాలు రాసేసి అవి మరికొందరికి మా ద్వారా పంపిస్తూంటే మేం ఆపేశామని గగ్గోలా!? అవును... అన్ని

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

ఆపేశారు. ప్రభుత్వానికి కూడా మీ పుస్తకాలు బట్వాడా చేయడానికి తడిసి మోపడవుతోంది కదా, అది ఆలోచించరా...!"

"బాగా అడుగుతున్నానా మంత్రి గారు...!? మీరలా చూస్తూ ఉండండి అంతే. మొత్తం రచయితలందరిని, కవులందరిని కడిగిపారేస్తాను".

\- - -

"అవునయ్యా, ఆపేస్తారు. బుక్ పార్సిల్ ఆపేస్తాం. సాధారణ పార్సిల్ కూడా ఆపేస్తాం. స్పీడ్ పోస్టు ఇచ్చారు కదా. అందులో పంపుకోండి. ఏం కాదన్నామ్మా...!.ఏంటీ డబ్బులు ఎక్కువవుతున్నాయా!? దానికి మేం మాత్రం ఏం చేస్తాం, ధరలు అలా మండిపోతున్నాయి. ప్రభుత్వానికి మాత్రం ఎన్ని ఖర్చులు! అవేం ఆలోచించకుండా ఏలికల మీద కోపాలొకటి. ఏంటీ...! ఖర్చులు ఏంటని గొణుగుతారా. ధైర్యంగా మాట్లాడండి, చూస్తాం. ఈ ముఖ పుస్తకాల్లో రాయడమెందుకు? మా ఇష్టం రాస్తారంటరా!? పెబుత్వం ఇష్టం, ఆళ్లు ఆపేయాలంటే ఆపేస్తారు. ఎవరి ఇష్టాలు వాళ్లవి. అక్షరాలు ఏం చేశాయంటూ ఓ లాజిక్ ఒకటి."

\- - -

"మంత్రి గారు మీరేం మాట్లాడకండి. వీళ్ల చనువిస్తే అల్మారాకి ఎక్కేస్తారు. మీరేం మాట్లాడకండి. అదిగో వాళ్లొచ్చినట్లున్నారు. అదే పోస్టల్ శాఖని ప్రైవేట్ చేసేయండి, మేం చూసుకుంటాం వీళ్లని అంటున్నారు. ముందు వాళ్లతో మాట్లాడి అది ఫైనల్ చేయండి. కాంట్రాక్ట్ ఎవరికి ఇవ్వాలన్న దానిపై దృష్టి పెట్టండి. వీళ్ల సంగతి నేను చూసుకుంటా."

\- - -

"లాల్చీ వేసుకుని సంచిలో నాలుగు పుస్తకాలు వేసుకుని ప్రతి రోజూ వచ్చేస్తాడు ఆయన. రోజూ తెలంగాణలో వాళ్లకి పావురంతో అంటూ పంపుతాడు. రాయలసీమ వాళ్లకి అభిమానంతో అంటాడు. కోస్తా వాళ్లకి ప్రేమతో అంటాడు. ఇలా ప్రతి ప్రాంతానికి పుస్తకాలు పంపేస్తాడు. వీళ్లు కాక ఇతర రాష్ట్రాల వాళ్లకి అంటూ కట్టలు కట్టలు పంపేస్తాడు. అదిగో కాటన్ చీర కట్టుకుని ఓసారి, పంజాబీ డ్రెస్ వేసుకుని మరోసారి వచ్చేసి క్యూలో నుంచుని మరీ పుస్తకాలు పంపేస్తుంది ఆవిడ. ఏమైనా అంటే బాధపడతారు. శుభ్రంగా వంటలు వండుకోవడం, సంసార బాధ్యతలు చూసుకోవచ్చు కదా. ఇలా కవిత్వం రాసేయడం, కథలు గీకేయడం. వాటిని అందరికి పంచడం... మీ వల్ల ప్రజా ప్రభుత్వానికి ఎంత భారం పడుతోందో తెలుసా...!?"

\- - -

"ఏంటీ, కొరియర్ వాళ్లు ఎక్కువ అడుగుతున్నారా!?. ప్రభుత్వ చర్యలు తప్పా? ప్రజల కోసం రాశామంటున్నారు కదా, వాళ్లలో ఈ కొరియర్ కంపెనీ వాళ్లు లేరా? ఏంటో గుసగుసలాడుతున్నారు? కొరియర్ కంపెనీ వాళ్లతో మంత్రిగారు లాలూచీనా! అవునండి. లాలూచీనే. మీరు మాత్రం తక్కువ తిన్నారా. ఆ చెప్పండి.. !"

"మంత్రిగారూ మీరు పళ్ల రసం తాగండి ముందు. నే చెప్తా వీళ్లకి సమాధానం."

"ఏంటమ్మా! లాలూచీనా... ఏం, మీరు లాలూచి పడటం లేదా. మీరు ఏడుపుగొట్టు జనాల గురించి రాసి వాళ్లతో లాలూచి పడడం లేదా. మేం చేస్తే తప్పా... ఆ... చెప్పండి...! మణిపూర్‌లో ఏదో జరిగిందయ్యా. అహ... ఏదో జరిగింది. మణిపూర్‌కి మార్కాపురానికి ఏమైనా సంబంధం ఉందా? అదెక్కడ... ఇదెక్కడ... ? ఇక్కడ మార్కాపురంలో ఉంటున్న కవయిత్రి అది అన్యాయం అని రాసేస్తారా? పైగా దాన్ని పుస్తకాల్లో అచ్చేసి అందరికీ పంచేస్తారా...! కోస్తాలో ఎక్కడో ఓ మూల జరిగిందది. తెలంగాణ కవికి ఏం సంబంధం. ఆ ... మీరు చెప్పండి. దళితుల మీద దౌర్జన్యం అని రాసేస్తాడా! ఇలా రాసిన వాళ్లందరి కవిత్వమో... కాకరకాయో కలిపి ఓ పేరెట్టేసి పుస్తకం ఏసేస్తారా?! ఇదేటమ్మా... వింత అన్నాయం అని ఉత్తరాంధ్ర చివరాఖరున ఉన్న పలాస కుర్రాడు మళ్లీ కవిత్వం రాయడం!"

\- - -

"ఇలా ప్రాంతాలతో సంబంధం లేకుండా సాహిత్యంతో నాట్లేసుకుంటూ పోతూంటే ఎంత తప్పు. ఏలికలకు ఎంత అవమానం. అందుకే ఆపేశారు. సంతోషించండి. స్పీడ్ పోస్టయినా ఉంచారు. అది కూడా దరమ పభువులు కాబట్టి."

"మంత్రి గారు పోస్టల్‌ని ప్రైవేట్ చేసే కాంట్రాక్ట్‌లో మాత్రం మీరెక్కడా తగ్గకండి. ఈ పాలీ పాతోళ్లకే కానీయండి, కాని కొత్త పేర్లతో అప్పగించేయండి".

\- - -

"వీళ్లని చూసి మీ కళ్లు ఎర్రగా అయిపోతున్నాయి. అలా కోపం అయిపోకండి. నా మాటినండి. యాప్లీస్ కాయ తినండి. కొత్త అవిడియాలు వత్తాయి. నే చూసుకుంటా ఈ కవుల్ని, రచయితల్ని. ఏటీ...! రాయడమే ఆపించేద్దారంటారా. అదిగో చూశారా. యాప్లీస్ కాయ రెండు ముక్కలు తిన్నారో లేదో ఎలా అవిడియాలు వచ్చేస్తున్నాయో. అలాగే కానిద్దాం. రాజు తలచుకుంటే ఆపేయడం ఎంత...! అయితే సివరాఖరుగానే మాట్లాడతా. ఆ తర్వాత ఆ పనే సేద్దారి."

\- - -

"ఇదిగో కవులు, రచయితలూ...! ఇనుకోండి... మీ మంచి కోరే....మీ బాగు కోరే... మీ అభివృద్ధి కోరే సెపుతున్నా. మీరు రాయడం మానేయండి. ఈ ప్రింటింగులు, ఆవిష్కరణ సభలు, మైకులు, మాట్లాడడాలు, రాసినాళ్ల మీద మళ్లీ రాయడాలు, మిమ్మల్ని చదివి కొత్తోళ్లు రాయడాలు. ఆళ్లని చూసి మరొకళ్లు, మరొకళ్లని సూసి ఇంకొకళ్లు... ఇలా ఎందుకు? రాయకండి.

\- - -

హైదరాబాద్ ఇరానీ కేఫ్‌లో, విశాఖపట్నం జగదాంబ సెంటర్‌లో, విజయవాడ బీసెంట్ రోడ్డులో, తిరుపతి నాలుగు కాళ్ల మండపం దగ్గర, రాజమండ్రి గోదారొడ్డున కొందరు కొన్ని కాగితాల మీద ఏదేదో రాసుకుంటున్నారు.

"ఆళ్లంతా ఎవలూ " అని మంత్రిగారు అడిగారు కారు అద్దాలు దించుతూ....

ఆయ్... ఆళ్లాండి.. ఆయ్.. ఆళ్లూ...

సృజనకారులండి...

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

- కోటి మంది లఖ్‌పతి దీదీలు
- బీహార్ ప్రజలపై ఎన్డీఏ హామీల వర్షం
- అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

పట్నా: బీహార్‌లో అధికార ఎన్డీఏ కూటమి శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను సంకల్ప్ పత్ర పేరుతో పట్నాలో విడుదల చేసింది. రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటికిపైగా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. వీటిలో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఇతరత్రా ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపింది. నైపుణ్యం ఆధారంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ సెన్సస్‌ను నిర్వహిస్తామని పేర్కొంది. ప్రతి జిల్లాలో మెగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. గ్లోబల్ స్కిల్ ట్రెనింగ్ సెంటర్‌గా బీహార్‌ను మారుస్తామని పేర్కొంది. కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ సీఎం నితీశ్ కుమార్, కేంద్ర మంత్రి, హిందుస్తాన్ అవామ్ మోర్చా అధినేత జితన్ రామ్ మాంఝీ, కేంద్ర మంత్రి, ధర్మేంద్ర ప్రధాన్, ఎల్‌జేపీ అధినేత చిరాగ్ పాస్వాన్, ఆర్ఎల్ఎం పార్టీ అధినేత ఉపేంద్ర కుశ్వాహ, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి సహా ముఖ్య నేతలు కలిసి 69 పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారు. అందులోని వివరాలను బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరీ వెల్లడించారు.

ఎన్డీఏ మేనిఫెస్టోలోని ఇతర హామీలు

ఈబీసీలలోని వివిధ వృత్తుల నిపుణులకు రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈబీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి, వారి అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సులు చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జీ ఛైర్మన్‌గా కమిషన్‌ను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలోని మహిళా వ్యాపారులను మిలియనీర్లు చేయడమే లక్ష్యంగా సర్కారు పనిచేస్తుంది. 1 కోటి మహిళలను 'లక్పతీ దీదీ'లుగా మారుస్తామని ఎన్డీఏ కూటమి వెల్లడించింది. స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేసే మహిళలకు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన ద్వారా రూ.2 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

7 ఎక్స్‌ప్రెస్ రహదారుల నిర్మాణం

పట్నాతో పాటు రాష్ట్రంలోని మరో నాలుగు నగరాల్లో మెట్రో ట్రైన్ సేవలు, 10 కొత్త ఇండస్ట్రియల్ పార్క్‌లను ప్రారంభిస్తారు. వీటి ద్వారా ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఏటా రూ.3వేల సాయం అందిస్తారు. వారికి మొత్తం రూ.9వేల లబ్ధి జరిగేలా చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తారు. ఉన్నత విద్యను చదువుతున్న ఎస్‌సీ విద్యార్థులకు నెలకు రూ.2వేల సాయాన్ని అందిస్తారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మెడిసిటీ నిర్మాణం, ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీని నిర్మిస్తారు. రాష్ట్ర ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తారు. పేదలకు 50 లక్షలకుపైగా పక్కా ఇళ్లను నిర్మించడంతోపాటు ప్రజలకు రూ.5 లక్షల దాకా ఉచిత వైద్య చికిత్సల సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తారు.

బీహార్ కా తేజస్వి ప్రణ్

మహాగట్బంధన్ కూటమి మంగళవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సంగతి విదితమే. బీహార్ కా తేజస్వి ప్రణ్ పేరుతో ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోగా ఈ మేనిఫెస్టోను అమల్లోకి తెస్తూ ఆదేశాలు ఇస్తానని విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం నుంచి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని వెల్లడించారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా... నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతల్లో ఈ స్థానాల్లో ఓటింగ్ జరగనుంది. దేశంలోని మరో 8 స్థానాల్లో నవంబరు 11న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలన్నీ నవంబరు 14నే విడుదల అవుతాయి.

పాతవాటికే దిక్కులేదు...కొత్త హామీలేల?

- 20 ఏళ్ల వైఫల్యానికి బీహార్ ప్రజలను క్షమాపణ కోరండి
- ఎన్డీఏ మేనిఫెస్టోపై తేజస్వీ మండిపాటు

పట్నా: అధికార ఎన్డీఏ కూటమి 'సంకల్ప్ పత్ర' పేరుతో విడుదల చేసిన బీహార్ ఎన్నికల మేనిఫెస్టోపై మహాగట్బంధన్ తీవ్ర విమర్శలు గుప్పించింది. గతంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన పాత హామీల అమలుకే దిక్కు లేనప్పుడు, మేనిఫెస్టోలో కొత్త హామీలను ఎందుకిచ్చారంటూ ఆర్‌జేడీ అగ్రనేత, మహాగట్బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ ఎన్డీఏని నిలదీశారు. గతంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైనందుకు 'సంకల్ప్ పత్ర'కు బదులుగా 'సారీ పత్ర'ను విడుదల చేసి ఉండాల్సిందని ఎద్దేవా చేశారు. సీఎం నితీశ్ కుమార్ ఆరోగ్యం సరిగ్గా లేదని, కనీసం మేనిఫెస్టోలో ఏయే అంశాలు ఉన్నాయనేది ఆయనకు తెలిసి ఉండకపోవచ్చని తేజస్వి పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా రాష్ట్రాన్ని ఎన్డీఏ కూటమే పాలిస్తోందని, అయినా పేద రాష్ట్రంగానే బీహార్ మిగిలిపోయిందన్నారు. ఈ వైఫల్యానికిగానూ 'సారీ పత్ర'ను విడుదల చేసి, 14 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ఎన్డీఏ హయాంలో బీహార్‌కు ఒక్క ఫ్యాక్టరీ కూడా రాలేదు. ఎలాంటి పెట్టుబడులు రాలేదు. అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం ఫెయిలైంది. గత 20 ఏళ్లలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? ఎన్ని నెరవేర్చలేదు? అనేది మేనిఫెస్టో ద్వారా ప్రజలకు తెలియజేసి ఉండాల్సింది. బీహార్‌లో మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కాలేజీలను నిర్మిస్తామని ఎన్డీఏ కూటమి గతంలో చెప్పింది. కానీ ఉన్న ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లోనే డాక్టర్లు, నర్సులు తగిన సంఖ్యలో లేరు. ప్రజలకు సరిగ్గా వైద్యం అందడం లేదు. అందుకే రాష్ట్ర ప్రజలకు ఎన్డీఏ క్షమాపణలు చెప్పాలి. అధికార కూటమి క్యారెక్టర్‌ను, పోకడను ప్రజలు బాగా అర్థం చేసుకున్నారు. ఇక మాకు విజయం ఖాయం. నిరుద్యోగితను నిర్మూలించేందుకు మా వెంటే ప్రజలు నిలువనున్నారు" అని తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు.

నితీశ్‌ను మాట్లాడనీయకపోవడం బీహార్‌కే అవమానం: గెహ్లాత్

పాలక ఎన్డీఏ మేనిఫెస్టో విడుదల సందర్భంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను మాట్లాడటానికి అనుమతించకపోవడంపై ఎన్డీఏ నాయకులను కాంగ్రెస్ విమర్శించింది. రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఎన్డీఏ మేనిఫెస్టో విడుదల హడావిడిగా జరిగింది. అది 26 సెకన్లు మాత్రమే కొనసాగింది...నితీశ్ కుమార్‌ను సమావేశంలో ప్రసంగించడానికి అనుమతించకపోవడం బీహార్, బీహారీలకు అవమానం అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లాత్ అన్నారు.

తమ 20 ఏళ్ల పాలన గురించి జర్నలిస్టుల ప్రశ్నలను ఎదుర్కోవడానికి ఎన్డీఏ నాయకులు భయపడుతున్నారని, అందుకే మేనిఫెస్టో విడుదల కార్యక్రమం ఒక నిమిషం లోపు ముగించారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోపై సీఎం నితీశ్ కుమార్ కాకుండా, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి ఎందుకు మాట్లాడారని గెహ్లాత్ ప్రశ్నించారు. కనీసం మేనిఫెస్టోపై మాట్లాడే స్థితిలో నితీశ్ లేరా అని నిలదీశారు. మేనిఫెస్టోపై మీడియాకు 26 సెకన్ల వివరణ ఇచ్చి ఎందుకు సరిపెట్టారో చెప్పాల్సిన బాధ్యత సీఎం నితీశ్‌పై ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఇంత చిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌ను చూడటం ఇదే తొలిసారి అని మీడియా ప్రతినిధులు తనతో చెప్పారని గెహ్లాత్ పేర్కొన్నారు. జేపీ నడ్డా, సీఎం నితీశ్ సహా పలువురు ముఖ్య నేతలు 26 సెకన్లే మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొని వెళ్లిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మీడియాకు, ప్రశ్నలకు ఎందుకు భయపడుతున్నారని వారిని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంపై ఎన్డీఏకి నమ్మకం లేదన్నారు. "ఎన్డీఏ మేనిఫెస్టో అబద్ధాల పరంపర. దీనిని మేము మా బహిరంగ సభల్లో హైలైట్ చేస్తాము. 20 సంవత్సరాల ఎన్డీఏ పాలన యొక్క రిపోర్ట్ కార్డ్‌ను డిమాండ్ చేస్తాము" అని అన్నారు. ఎన్డీఏ నాయకులు తమ విలేకరుల సమావేశాన్ని రిపోర్ట్ కార్డ్‌తో ప్రారంభించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో కీలకమైన మేనిఫెస్టో విడుదల ఘట్టాన్ని అపహాస్యం చేసేలా ఎన్‌డీఏ కూటమి వ్యవహరించిందని ఆయన మండిపడ్డారు. మేనిఫెస్టోపై ఎన్‌డీఏ కూటమికి నమ్మకం లేనట్టుగా కనిపిస్తోందని, ఒకవేళ నమ్మకం ఉంటే దాని గురించి ప్రజలకు లోతుగా వివరించి ఉండేవాళ్లన్నారు.

మహిళల ఓట్లే కీలకం

- సంక్షేమ పథకాలతో కూటముల గాలం
- ఎన్డీఏ, మహాగట్బంధన్ పోటాపోటీ హామీలు

పట్నా: బీహార్‌లో గత ఐదు అసెంబ్లీ ఎన్నికల సరళిని పరిశీలించినట్లయితే మహిళా ఓటర్లను ఆకట్టుకున్న కూటములే అధికారంలోకి వచ్చాయి. దీంతో అధికార కూటమి, విపక్ష కూటమి అనే తేడా లేకుండా బీహార్‌లోని అన్ని రాజకీయ పక్షాల చూపు ఇప్పుడు మహిళా ఓటర్ల వైపే ఉంది. రాష్ట్రంలో పురుషులతో పోల్చినట్లయితే మహిళా ఓటర్ల పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతూ వస్తోంది. అందుకే మహిళా ఓటర్ల మనసులను గెల్చుకోవడమే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలను పార్టీలు ప్రకటిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం, భద్రతలను అందిస్తామని భరోసా కల్పిస్తున్నాయి. మహిళా ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు అధికార ఎన్డీఏ కూటమి, విపక్ష ఇండియా (మహాఘట్బంధన్) కూటములు పోటీపడుతున్నాయి.

బీహార్‌లో మొత్తం 7.41 కోట్ల మంది ఓటర్లు ఉండగా... వీరిలో 3.49 కోట్ల మంది మహిళా ఓటర్లే ఉండటం విశేషం. అంటే రాష్ట్రంలోని ప్రతి ఇద్దరు ఓటర్లలో ఒకరు మహిళే. ఓట్లు వేసే విషయంలో మహిళలదే పైచేయి. 2010లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పురుషుల పోలింగ్ 51.12 శాతం కాగా, మహిళల పోలింగ్ 54.49 శాతం నమోదైంది. 2015లో పురుషుల పోలింగ్ 53 శాతం, మహిళల పోలింగ్ 60 శాతానికిపైగా నమోదైంది. 2020లో మొత్తం 57.09 శాతం పోలింగ్ నమోదవగా... 54.45 శాతం మంది పురుషులు, 59.6 శాతం మంది మహిళలు ఓట్లు వేశారు. మహిళల పోలింగ్ శాతం క్రమంగా ప్రతీ అసెంబ్లీ ఎన్నికలో పెరుగుతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం.

2010 నుంచి 2020 మధ్యకాలంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయంలో మహిళా ఓటర్లదే కీలక పాత్ర. గత 20 ఏళ్లలో మహిళా ఓటర్ల కోసం దేశంలోనే తొలిసారిగా సీఎం నితీశ్ ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను అమల్లోకి తెచ్చారు. స్వయం సహాయక సంఘాల్లో జీవికా దీదీలను నియమించారు. మెట్రిక్యులేషన్ ,గ్రాడ్యుయేషన్‌లలో ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించిన విద్యార్థినులకు సైకిల్ అందించే పథకాన్ని అమల్లోకి తెచ్చారు. మైనారిటీ మహిళల కోసం హునర్ పథకాన్ని అమలు చేస్తున్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలిచ్చే 'ముఖ్యమంత్రి స్టార్టప్ స్కీం'తో పాటు మహిళలు వ్యాపారాలు ప్రారంభించడానికి సీడ్ గ్రాంట్‌గా రూ. 10,000 అందించే 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను నితీశ్ అమల్లోకి తెచ్చారు. మహిళా గ్రాడ్యుయేట్లకు రెండేళ్ల పాటు భృతిని ఇస్తున్నారు. మమత, ఆశా కార్యకర్తలకు అందించే ప్రోత్సాహకాలను పెంచారు. రాష్ట్రంలో సామాజిక భద్రతా పెన్షన్లు పొందుతున్న 1.13 కోట్ల మందిలోనూ ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఈ పథకాల ద్వారా ఎంతోమంది మహిళా ఓటర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక ప్రయోజనం లభిస్తోంది. వాళ్లంతా తమ వైపే నిలుస్తారనే నమ్మకంతో ఎన్డీఏ కూటమిలోని పార్టీలు ఉన్నాయి. అ

మహిళల ఆర్థిక ఉన్నతిపై ఆర్‌జేడీ దృష్టి

'10 లక్షల ఉద్యోగాలు ఇస్తా' అనే హామీ ద్వారా 2020 ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో మహిళా ఓటర్లను రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అగ్రనేత తేజస్వీ యాదవ్ ఆకర్షించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళలు, యువతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ఆయన ప్రకటించారు.

తమ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 'మాయీ బెహెన్ మాన్ యోజన' కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఇస్తామని, జీవికా దీదీల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని, వారి రుణాలను మాఫీ చేస్తామన్నారు. మాతా,శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. మహిళల వ్యాపారాలకు చేయూత అందిస్తామని చెప్పారు. కొత్త తరం మహిళలు భద్రత, సబ్సిడీలతో పాటు సమాన అవకాశాలు, సామాజిక గుర్తింపును కోరుకుంటున్న విషయాన్ని ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వీ గుర్తించారు. అందుకే ఆయన మహిళల స్వయం సమృద్ధికి చేయూత అందిస్తానని, అందుకోసం ప్రత్యేక పథకాలను అమల్లోకి తెస్తానని ఆయన హామీ ఇస్తున్నారు.

చేతులెత్తితే ఎవరైనా సభాపతి కావచ్చు: ప్రదీప్ ఈశ్వర్

బెంగళూరు: కర్నాటక శాసనమండలి చైర్మన్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చేతులెత్తితే ఎవరైనా చైర్మన్ కావచ్చని, కానీ ఎమ్మెల్యే కాలేరని అన్నారు. ఈ వ్యాఖ్యలు చేసింది చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్. ఇటీవల మీడియాతో మాట్లాడిన చైర్మన్ బసవరా హోరట్టి ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రదీప్ ఈశ్వర్ ఓ ఆకస్మిక ఎమ్మెల్యే అన్నారు. దీనికి ప్రదీప్ ఈశ్వర్ శుక్రవారం స్పందిస్తూ పరిషత్‌లో సభ్యులు చేతులు ఎత్తితే సభాపతి కాగలరని కానీ ఎమ్మెల్యే కావడం సాధ్యం కాదన్నారు. కనీసం లక్ష ఓట్లు కావాలన్నారు. అయితే ప్రదీప్ ఈశ్వర్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సభాపతి బసవరాజ హోరట్టి ఏడుసార్లు వరుసగా ఒకేస్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అటువంటి చరిత్ర కలిగిన వారు బహుశా దేశంలోనే లేరు. అటువంటి సీనియర్ నేతపైనా నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని విమర్శలు వ్యక్తం కాగా కొందరు ప్రదీప్ ఈశ్వర్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు.

పహల్గాం ఉగ్రవాదులను వేటాడిన పోలీసులకు పురస్కారాలు

న్యూఢిల్లీ: ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా వివిధ ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 1466 మంది పోలీసులకు కేంద్ర హోంశాఖ అత్యుత్తమ పురస్కారాలు ప్రకటించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పోలీసులు సహా కేంద్ర బలగాలను 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్ 2025'కు ఎంపిక చేశారు. వీరిలో పహల్గాం ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్న 40 మంది జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు. పహల్గాం దాడికి తెగబడిన ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత సైన్యం, జమ్మూ పోలీసులు, ఇతర భద్రతా దళాలు సంయుక్తంగా 'ఆపరేషన్ మహాదేవ్' చేపట్టి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇందులో పాల్గొన్న ఐజీ (కశ్మీర్ రేంజ్) వీకే బిర్ది, సీనియర్ ఎస్పీ (శ్రీనగర్) జీవీ సందీప్ చక్రవర్తితోపాటు జమ్మూకశ్మీర్‌కు చెందిన 19 మంది పోలీసులు హోంశాఖ అవార్డుకు ఎంపికయ్యారు. ఓ డీఐజీ సహా పలువురు ఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుళ్ల వరకు ఈ అవార్డు ఎంపికైన వారిలో ఉన్నారు. 21 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా ఈ మెడల్‌ను తీసుకోనున్నారు.

తెలుగు రాష్ట్రాల నుంచి...

తెలంగాణకు చెందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు (లక్ష్మణరావు, జాకబ్), ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు (చంద్రబాబు, ఉపేందర్ రావు, తిరుపతి) ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఎస్పీ (అద్నాన్ నయీం అస్మీ), అదనపు ఎస్పీ (భీమా రావు), డీఎస్పీ (ఆర్‌జీ జయసూర్య), ఎస్ఐ (ఎండీ నసీరుల్లా)తోపాటు ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఫణి భూషణ్) ఈ అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. హోంశాఖ పరిధిలో గతంలో ఉన్న వివిధ ప్రతిభా పురస్కారాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం... 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్'ను 2024లో ప్రవేశపెట్టింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన 'ఏక్తా దివస్' సందర్భంగా ఏటా అక్టోబర్ 31న వీటిని ప్రకటిస్తారు. 2025 ఏడాదికిగాను దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఇంటెలిజెన్స్, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 1466 మంది పోలీసు, భద్రతా సిబ్బందిని ఈ మెడల్‌కు ఎంపిక చేశారు.

ఆ బిడ్డ గురించే మా బాధంతా: సుప్రీం

న్యూఢిల్లీ: బిడ్డ సంరక్షణపై భారత్‌కు చెందిన భర్త, రష్యాకు చెందిన భార్య చేస్తోన్న న్యాయ పోరాటంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రష్యా మహిళ ఆచూకీపై ఆ దేశ ఎంబసీ నుంచి తగిన స్పందన రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది.'రెండు దేశాల సంబంధాలను ప్రభావితం చేసే ఎలాంటి ఉత్తర్వులను మేం జారీ చేయాలని అనుకోవడం లేదు. ఇది ఒక చిన్నారికి సంబంధించిన కేసు. ఇది చాలా సున్నితమైన అంశం. తన తల్లితో ఉన్నందున ఆ బిడ్డ క్షేమంగా ఉన్నాడని మేం ఆశిస్తున్నాం. ఇది చిన్నారుల అక్రమ రవాణా కేసు కాదని మేం భావిస్తున్నాం' అని కోర్టు వ్యాఖ్యలు చేసింది. ఆమె వివరాలను సేకరించేందుకు అధికారులకు రెండు వారాల గడువు ఇచ్చింది. గత విచారణలో కోర్టు స్పందిస్తూ... 'తల్లి లేక తండ్రికి ఇంతవరకు చిన్నారి కస్టడీ అప్పగించలేదు. సుప్రీంకోర్టు కస్టడీ నుంచి ఆ బిడ్డను లాగేసుకుపోయారు' అని తీవ్రంగా స్పందించింది. తన నుంచి విడిపోయిన రష్యన్ మహిళ వద్ద ఉన్న బిడ్డ సంరక్షణ కోసం భారత్‌కు చెందిన తండ్రి పోరాడుతున్నారు. గతంలో న్యాయస్థానం ఆదేశాలను ఆమె పట్టించుకోలేదని ఆరోపించారు. జులై 7 నుంచి బిడ్డతోపాటు ఆమె ఆచూకీ తెలియడం లేదని, ఆమెను కోర్టు పరిధి నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. జులై 4న రష్యా ఎంబసీ వెనుక ద్వారం నుంచి ఓ దౌత్యాధికారి ఆమెను లోపలికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోందన్నారు. ఆమె సరిహద్దు దాటి నేపాల్‌లోకి ప్రవేశించి... అక్కడి నుంచి షార్జా మీదుగా రష్యా వెళ్లినట్లుగా భావిస్తున్నామని గత విచారణలో కేంద్రం వెల్లడించింది. మాస్కోలోని భారత ఎంబసీ ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా... రష్యా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని విదేశాంగశాఖ వెల్లడించింది. ఢిల్లీ పోలీసులు ఇదే విషయాన్ని వెల్లడించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించి ఉంటే... ఆ మహిళ అంత సులువుగా దేశం దాటి వెళ్లగలిగేవారు కాదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆమె జాడ గుర్తించేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే ఆదేశించింది.

భారీ మంచు వర్షం... రెడ్ అలర్ట్

గ్యాంగ్‌టక్: భారత్-చైనా సరిహద్దు ప్రాంతంలో భారీగా మంచు వర్షం కురుస్తోంది. ఇరుదేశాల మధ్య ఉన్న నాసలా పాస్‌లో భారీ మొత్తంలో మంచు కొండలు ఏర్పడ్డాయి. సిక్కిం సరిహద్దు ప్రాంతంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో లోయప్రాంతాల్లో ఉన్న వివిధ ప్రాంతాల మార్గాలు మంచు కారణంగా మూసుకుపోయాయి. మంచు ప్రాంతాలకు అతి దగ్గరగా ఉన్న సిక్కింలోని వివిధ ప్రాంతాల ఉష్ణోగ్రతలు సున్నా స్థాయికి పడిపోయాయి. అప్రమత్తమై సిక్కిం ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. మంచు వర్ష ప్రభావం ఉన్న ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. నాథులా, కుప్పు, చీనాగ్ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో మంచువర్షం కురిసిందని భారత్ వాతావరణ శాఖ పేర్కొంది. సిక్కింలో రాబోయే 24 గంటల్లో తీవ్రమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని పేర్కొంది. పర్యాటకులు, వాహనాదారులు ఎత్తైన ప్రాంతాలకు ప్రయాణించొద్దని అధికారులు సూచించారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందాలు మంచును తొలగించడానికి, అవసరమైన కనెక్టివిటీని నిర్ధారించడానికి నిరంతరం పనిచేస్తున్నాయి.

వాయు కాలుష్యంతో వైరల్ ఇన్ఫెక్షన్లు

అనారోగ్యం బారిన 75 శాతం కుటుంబాలు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదయ్యాయి. ఈ వాయు కాలుష్యం రాజధాని వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విషపూరిత గాలి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. ప్రతీ ఇంట్లో ఒకరు ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతమవుతున్నారు. కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో ఈ కీలక విషయం వెల్లడైంది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో దాదాపు 75 శాతం కుటుంబాల్లో కనీసం ఒకరు అనారోగ్యంతో ఉన్నారని తేలింది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లో 15 వేల కుటుంబాలపై సర్వే చేయగా... అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు తేలింది. శ్వాసకోశ సమస్యలు, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ, కళ్ల మంటలు, తలనొప్పితో ఇబ్బందిపడుతున్నారు. ఫ్లూ , ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల కేసుల్లో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. ప్రతి ఒక్కరిలో దీర్ఘకాలిక జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, అలసట, ఒళ్లు నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు వంటి లక్షణాలు ఉన్నాయని చెప్పారు. వారు కోలుకునేందుకు కూడా చాలా సమయం పడుతోందని వివరించారు. ఈ వైరల్ ఇన్ఫెక్షన్లు పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారినే ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్లు తెలిపారు.

కేజ్రీవాల్‌కు మరో శీష్ మహల్: బీజేపీ



న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ వినిపించిన 'శీష్ మహల్' పదం మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చండీగఢ్‌లో లగ్జరీ భవనం కేటాయించినట్లు బీజేపీ ఆరోపించింది. ఆ భవనం ఫొటో షేర్ చేసింది. 'సామాన్యుడిగా ప్రచారం చేసుకున్న వ్యక్తికి సంబంధించి మరో శీష్ మహల్ ఇది. ఢిల్లీలోని మహల్ నుంచి ఖాళీ చేసిన తర్వాత... పంజాబ్ సూపర్ సీఎంగా చలామణి అవుతోన్న కేజ్రీవాల్ కోసం మరో విలాస భవనాన్ని నిర్మించారు. చండీగఢ్ సెక్టార్2లో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 7 స్టార్ భవనం కేజ్రీవాల్‌కు కేటాయించారు' అని భవనం చిత్రాన్ని బీజేపీ షేర్ చేసింది. ఈ ఫొటోను ముందుగా ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతీ మాలీవాల్ నెట్టింట్లో పంచుకున్నారు. ఆమె కొంతకాలంగా సొంతపార్టీపై విమర్శలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... ఢిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా బీజేపీ ప్రచారం చేసింది. రూ.45 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7- స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ ప్రజల్లోకి తీసుకెళ్లింది.

రాజస్థాన్ హైకోర్టుకు బాంబు బెదిరింపు

జైపూర్: దేశంలో బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పాఠశాలలు, విమానాశ్రయాలు, కార్యాలయాలు, ప్రముఖులకు వరుస బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం ఉదయం రాజస్థాన్ హైకోర్టుకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించారు. లాయర్లు, సిబ్బంది, ప్రజలను బయటకు పంపించారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కోర్టు ప్రాంగణంలో తనిఖీలు చేపట్టారు. ఈ బెదిరింపు మెయిల్‌తో కోర్టు ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిల్లర రాజకీయాలు మానండి

మోదీ వ్యాఖ్యలపై స్టాలిన్



చెన్నై: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తమిళనాడులో ఉన్న బీహార్ ప్రజలపై డీఎంకే ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'ఒక తమిళుడిగా తాను మోదీని వినయంగా కోరుతున్నాను. ఆయన దేశ ప్రజలందరికీ ప్రధాని అనే గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారనే విషయాన్ని తరచుగా మర్చిపోతున్నారేమో అని నాకు బాధగా ఉంది. ఇలాంటి ప్రకటనల ద్వారా తన బాధ్యతకు తగిన గౌరవాన్ని ఆయన కోల్పోకూడదు. బీజేపీ సభ్యులు ఎక్కడికి వెళ్లినా ఒడిశా-బీహార్ అని మాట్లాడుతూ, కేవలం ఎన్నికల రాజకీయాల కోసం తమిళులపై తమ ద్వేషాన్ని వ్యక్తపరుస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఇక్కడి ప్రజల తరపున తాను బీజేపీ సభ్యుల ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. వివిధ సంస్కృతులు, భిన్నత్వంలో ఏకత్వం గురించి గొప్పగా చెప్పుకునే భారతదేశంలో, హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వాన్ని పెంచడం, ...తమిళులు, బీహార్ ప్రజల మధ్య విరోధాన్ని సృష్టించే ఇటువంటి చిల్లర రాజకీయ పద్ధతులను మానుకోవాలని నేను ప్రధాని, బీజేపీ సభ్యులను కోరుతున్నాను. దయచేసి దేశ సంక్షేమంపై దృష్టి సారించండి' అంటూ స్టాలిన్ రాసుకొచ్చాడు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట : ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ :పేద ప్రజలను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో షాద్ నగర్ నియోజక వర్గంలోని కేశంపేట కొత్తూరు, నందిగామ, మండలాలకు సంబంధించి రూ.23 లక్షల 24 వేల చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ఎంతో ఖర్చుపెట్టి అప్పుల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిరంతరంగా వారికి సాయం అందజేస్తుందన్నారు. పేద ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకొని వైద్యం పొందుతున్నారని ఓవైపు ఆరోగ్య శ్రీ మరోవైపు సీఎం రిలీఫ్ ఫండ్ లాంటి బృహత్తర కార్యక్రమాలతో వారికి స్వాంతన చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ పేద ప్రజలకు సాయం చేసేందుకు ఎక్కడ వెనుకడుగు వేయడం లేదని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. పేద ప్రజలకు నిరంతరం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అదేవిధంగా ఆరోగ్య శ్రీ ద్వారా ఎంతో ఆర్థికంగా అండగా నిలబడుతుందని పేద ప్రజలను తమ సొంత కన్న బిడ్డల ప్రభుత్వం చూసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వివిధ మండలాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

షేక్ రహ్మత్ అలీ పదవీ విరమణ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో శుక్రవారం షేక్ రహ్మత్ అలీ రికార్డ్ అసిస్టెంట్ పదవి విరమణ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి స్వర్ణలత, డిప్యూటి ఈఐఈ నాగాంజలి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాచార శాఖ వారు షేక్ రహమత్ ఆలీ సేవలను గుర్తు చేస్తూ వారి నిబద్ధత, నిస్వార్థత, విధుల పట్ల వారు నిర్వహించిన బాధ్యతలు శ్లాఘనీయం అన్నారు. అలాగే వారి శేష జీవితం ఆరోగ్యంగా ప్రశాంతంగ సాగిపోవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. షేక్ రహమత్ అలీ స్పందిస్తూ రాష్ట్ర సమాచార శాఖ విభాగంలో అనేక జిల్లాలలో సేవలు చేసే అవకాశం అనేది అదృష్టంగా భావిస్తున్నానని, ఇందుకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, షేక్ రహమత్ అలీని పలువురు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా దేవత సుధాకర్ గజల్ ఆలాపన ఆకర్షించింది. ఇందులో డిపిఆర్ఓ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు, పాత్రికేయులు, షేక్ రహమత్ అలీ కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత దేశానికి ప్రధాన మంత్రిగా ఆమె సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ బి కే శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు మహిళా నాయ కురాలు డివిజన్ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సర్దార్ పటేల్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విచ్చేసి విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

బండరాయి ప్రపమాద స్థలాం పరిశీలన

గౌతమ్ నగర్‌లో నిన్న బండరాయి ఆటో రిక్షా మీద పడి ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన వారిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాలు డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ఇందిరమ్మ కృషి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక క్లాక్ టవర్ లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సర్దార్ వల్లభబాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా తన హయాంలో రాజభరణాలు రద్దు చేశారని.. బ్యాంకులను జాతీయం చేసి ప్రజా సంక్షేమం కోసం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని అన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అమరేందర్ రాజు, సిరాజ్ ఖాద్రీ, రాఘవేందర్ రాజు, సాయిబాబా, రాకేష్ పటేల్, కంచిమి లక్ష్మణ్, రాములు యాదవ్, తాహెర్, నాగరాజు, అబ్దుల్ హక్, పీర్ సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ కృషి

విశాలాంధ్ర-జవహర్ నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం కార్మిక హక్కుల సాధనకు ఏఐటియుసి విశేష కృషి చేసిందని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటపల్లి శంకర్ అన్నారు.106వ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకొని భవన కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో ఏఐటీయుసీ ఆటో యూనియన్ అడ్డ మీద ఏఐటిసి కాప్రా మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, భవన కార్మిక సంఘం కాప్రా మండల అధ్యక్షులు కొండ సత్యం, కే కురుమయ్య, మహిళా సమైక్య కాప్రామండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, ఏ ఐ టి యు సి నాయకులు లింగం, పి అనిల్, ఏ శ్రీశైలం ఈ మహేష్ బాబు గౌడ్ ఎస్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఏఐటీయూసీ106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుబంధ కార్మిక సంఘాలు, కార్యకర్తలకు, నాయకులకు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ అదే విధంగా దోపిడీకి, అన్యాయాలకు గురవుతున్న కార్మిక వర్గానికి, వారి పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొంటూ, నాయకత్వం వహించినటువంటి నాటి కార్మిక నాయకులు 1920 అక్టోబర్ 31న బొంబాయి మహానగరంలో నడిసముద్రంలో రహస్యంగా లాలా లజపతి రాయ్ అధ్యక్షతన సమావేశం జరిపి ఏఐటీయూసీ ప్రారంభించటం జరిగిందన్నారు. 1920 అనంతరం చేసిన అనేక పోరాటాలు, ఉద్యమాలు, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడుతునే 1923లో ప్రమాద నష్టపరిహార చట్టం బ్రిటీష్ ప్రభుత్వ మెడలు వంచి సాధించుకోవటం జరిగింది. 1926లో ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కు కావాలని పోరాడి సాధించుకున్న గొప్ప పోరాట చరిత్ర కల్గిన ఎఐటియుసి అని ఆయన కొనియాడారు. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలోనే అనేక కార్మిక చట్టాలను సాధించుకోవటం జరిగిందని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ భారత ప్రభుత్వంపై పోరాడి కార్మిక చట్టాలను సాధించుకొని అమలు చేస్తున్న సందర్భంలో, బిజెపి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి గత 11 సంవత్సరాల కాలంలో ఈ దేశానికి ప్రధాన మంత్రి మోదీ బీజేపీ ఎన్డీయే ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడావ్యాపారస్తులకు, ధనవంతులకు మేలు చేసే ఉద్దేశంతో అనేక త్యాగాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను సంపూర్ణంగా రద్దు చేసి, 4 కోడ్‌లు తీసుకొచ్చి కార్మికవర్గానికి ఎనలేని అన్యాయం, కార్మిక హక్కుల అమలు కాకుండా చేస్తున్నారని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తూ ఒక ప్రక్క పోరాటాలు, ఉద్యమాలు చేస్తూనే 27సార్లు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలు చేసి 4 కోడ్‌లను అమలు చేయకుండా కేంద్ర కార్మిక సంఘాలు అడ్డుపడుతున్నాయని ఆయన కార్మిక సంఘాలను అభినందించారు. భవిష్యత్తులో కోడ్‌లను అమలు చేయకుండా 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని పోరాటాలు, ఉద్యమాలు కొనసాగిస్తూనే కేంద్రంలో ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక ఎన్డీయే ప్రభుత్వాన్ని దించకపోతే కార్మికులకు కార్మిక చట్టాలు అమలుకాక దోపిడికి గురవుతారని ఆయన హెచ్చరించారు. అదే విధంగా దేశంలోని రైతులు, అసంఘటితరంగ కార్మికులు నిత్యం కష్టాలు, బాధలు పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఎఐటియుసి అవతరణ దినోత్సవం తెలంగాణ రాష్ట్రంలో అన్ని యూనియన్లు ఉన్న చోట, అన్ని మండలాల్లో, జిల్లాల్లో, రాష్ట్ర వ్యాపితంగా ఎఐటియుసి దిమ్మెలకు రంగులు వేసి, ఎర్రతోరణాలతో అలంకరించి, ఎఐటియుసి జెండాలను ఎగురవేసి 106వ ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొని, పోరాటాలు చేసే దీక్షా దినంగా భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు శ్రీకారం చుట్టాలని ఆయన కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, బొడ్డుపలి కిషన్, పి.వెంకటయ్య, చెట్టుకింది శ్రీనివాస్, క్రిష్ణమూర్తి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాపితంగా పాల్గొన్న యావత్తు కార్మికులకు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున శుభాకాంక్షలు, ధన్యవాదాలు ఆయన తెలియజేశారు.

కార్మిక వర్గంపై దాడులు : ఎం నరసింహ

విశాలాంధ్ర, హైదరాబాద్ : కేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గంపై అత్యంత దారుణమైన దాడులు జరుగుతున్నాయని ముఖ్యంగా గత కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసిన కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి, వాటి స్థానంలో కార్పొరేట్ అనుకూల 4 లేబర్ కోడ్‌లను తీసుకరావడం వల్ల ఇంకా కార్మిక వర్గంపై దాడులు పెరిగిపోయాయని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఏం. నరసింహ తెలిపారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, గోల్నాక లేబర్ అడ్డా వద్ద ఏం. నరసింహ ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత జరిగిన సభలో ఏం. నరసింహ మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక వ్యతరేక విధానాల వల్ల అభద్రతా ఉద్యోగాలు, సామాజిక భద్రత లేకపోవడం, దోపిడీ పని పరిస్థితులు, తక్కువ వేతనాలు మరియు యూనియన్ల విధ్వంసంతో కార్మికుల బ్రతుకులు ప్రమాదకరంగా మారుతున్నాయని చెప్పారు. కార్మిక వ్యతరేక బీజేపీ నయా ఫాసిస్ట్ ధోరణులకు వ్యతరేకంగా కార్మిక వర్గం తీవ్రంగా ప్రతిఘటించవలసిన అవసరముందని. ఇందు కోసం కార్మికులు సంఘటితంగా కార్యచరణ రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం కావాలని ఏం. నరసింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్‌ఈ, హైదరాబాద్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెట్టుకింద శ్రీనివాస్, గోల్నాక అడ్డా నాయకులు కాశయ్య, గాజుల శ్రీనివాస్, లింగస్వామి. ఎస్.నాగరాజ్, రాము, వి.రవి.భూషయ్య, శీను, శైలేష్, గణేష్, కే.రవి నాగరాజ్ పాల్గొన్నారు.

గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రం చరిత్ర : మంత్రులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : దేశంలోని తొలి జాతీయ గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్ షిప్ 2025లో తెలంగాణకు విజేతగా గౌరవం దక్కింది. దేశంలో తొలిసారిగా నిర్వహించిన జాతీయ గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్ షిప్ 2025లో తెలంగాణ చరిత్ర సృష్టించింది. 30 బంగారు, 40 వెండి, 18 కాంస్య పతకాలు సాధించి విజేతగా నిలిచింది. అస్సాం రాష్ట్రం రన్నరప్‌గా నిలిచింది. అక్టోబర్ 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్ లో జరిగిన మూడు రోజుల పోటీలు గిరిజన క్రీడా రంగంలో కొత్త మైలురాయిగా నిలిచాయి. గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీని గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ (టిసిఆర్ అండ్ టిఐ), గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించాయి. దేశంలోని 10 రాష్ట్రాల క్రీడాకారులు 200 మీటర్లు , 500 మీటర్ల దూరంలో పురుషులు, మహిళలు, 16 ఏళ్లలోపు, 16 ఏళ్ళు పైబడిన వయసు విభాగాల్లో కానోయ్ కయాక్ విభాగాలలో పోటీ పడ్డారు. ఈ ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర క్రీడల మంత్రి వాకాటి శ్రీహరి, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై విజేతలను అభినందించారు. క్రీడాకారుల క్రమశిక్షణ, కృషి, పట్టుదల ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ దేశంలో తొలి జాతీయ గిరిజన కానోయ్ స్ప్రింట్ ఛాంపియన్‌షిప్‌కి ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. ఇది సమగ్ర క్రీడాభివృద్ధికి రాష్ట్రం కట్టుబడి ఉన్నదనడానికి నిదర్శనం అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త క్రీడా విధానం రూపకల్పన చేస్తోందని, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువతను గుర్తించి, ప్రోత్సహించి, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. భారతదేశం గత ఒలింపిక్స్‌లో 6 పతకాలు సాధించగా, తెలంగాణ కంటే చిన్న దేశమైన దక్షిణ కొరియా 32 పతకాలు సాధించింది. 2036 నాటికి భారత్ ప్రపంచ క్రీడా శక్తిగా నిలుస్తుందనే నమ్మకం ఉందని, క్రీడలు కొద్ది మందికి మాత్రమే పరిమితం కావని ఉత్సాహం ఉన్న ప్రతి యువకుడికీ అవి అందేలా కృషి చేయాలన్నారు. క్రీడల పట్ల ప్రజల దృక్పథం మారుతోందని, తల్లిదండ్రులు ఇప్పుడు పిల్లలను క్రీడల్లో కెరీర్‌గా ముందుకు సాగమని ప్రోత్సహిస్తున్నారని ఆయన అన్నారు. క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌లను ఇటీవల డీఎస్పీ హోదాలతో సత్కరించడాన్ని ఆయన ప్రస్తావించారు. గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. గిరిజన యువతను క్రీడల ద్వారా శక్తివంతం చేయడంలో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ చేసిన కృషిని ప్రశంసించారు. విజేతలు, పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకి బహుమతులను, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డా. వి. సముజ్వాలా డైరెక్టర్, సర్వేష్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ కోటాజీ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, హైదరాబాద్, రామకృష్ణ, కోచ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రామరాజు మృతికి నేతల నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాదులో గురువారం మరణించిన బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్, శాంతి సంఘం నాయకులు రామరాజు భౌతికకాయంపై పార్టీ పతాకం ఉంచి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఇ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎస్ ఛాయాదేవి, శాంతి సంఘ నాయకులు కేవిఎల్, నాగేశ్వరరావు, అనూష, రాష్ట్ర యువజన సమాఖ్య ప్రధాన కార్య దర్శి ధర్మేంద్ర, హైదరాబాద్ నగర కార్యదర్శి స్టాలిన్, హైదరాబాద్ నగర యువజన సమాఖ్య నాయకులు ఎన్.శ్రీకాంత్ తదితరులు నివాళు లర్పించారు.

రామరాజు మృతి పట్ల కూనంనేని సంతాపం

రంగారెడ్డి జిల్లా సిపిఐ సీనియర్ నాయకులు దివంగత నేత ఏఆర్ దేవరాజు కుమారుడు ఏ.ఆర్ రామరాజు మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని తెలియజేశారు. రామరాజు బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్‌లో నాయకుడిగా పని చేస్తున్నారు. ఆయన అకాల మరణం తీవ్ర విషాదాన్ని కలిగించిందని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

శాంతి ఉద్యమంలో రామరాజు పాత్ర చిరస్మరణీయం...

అఖిల భారత శాంతి సంఘీభావ సంగం హైదరాబాద్ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏ. రామరాజు ఆకస్మిక మరణం శాంతి ఉద్యమానికి తీరని లోటని, ఆయన పాత్ర గర్వనీయమైని ఏఐపిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్, ప్రధాన కార్యదర్శి జి. నాగేశ్వర రావులు, రామరాజు సేవలను కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరజీవి దేవరాజు సంతానంగా కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో పుట్టిన రామరాజు విద్యార్థి దశలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య సంఘంలోనూ, ఉద్యోగ కాలంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ లోను, అటు తరువాత రిటైర్మెంట్ అనంతరం రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ లోను శాంతి సంఘీభావ సంఘంలోనూ చురుకైన పాత్రను పోషించాడని రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ మాట్లాడుతూ శాంతి సంఘీభావ సంఘంలో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సామ్రాజ్యవాదానికి, యుధోన్మాదానికి, జాతీయం కారానికి వ్యతిరేకంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సాగిన అనేక పోరాటాలలో రామరాజు ఉన్నాడని, ఇటీవలనే హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యక్రమాలు తీసుకున్న దాంట్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. రామరాజు మరణ వార్త తెలవగానే శాంతి సంఘం నాయకులు రామరాజు భౌతికకాయంపై పుష్పగుచ్చా నుంచి ఏఐపిఎస్ఓ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు తిప్పర్తి యాదయ్య, రాష్ట్ర ప్రధాన కాచం సత్య నారాయణ, రాష్ట్ర కార్యదర్శి అనూష, హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గురుబచ్చన్ సింగ్,ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, కార్యదర్శులు సుధా వన్, రాజేందర్, సూర్య ప్రకాష్, ఆంజనేయులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం నాయకులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని ఆగ్రహం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తం చేశారు. శుక్రవారం పలువురు ఎంఐఎం నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ.. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఫైరయ్యారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. అయితే.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలని అన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు కేటీఆర్. పేదల ఇండ్లు కూలగొట్టిన ఈ బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక.. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని ఆయన ధైర్యం చెప్పారు. ప్రజలకు తాము ఎప్పటికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పనిచేయాలని అన్నారు. కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అక్రమాలు, నేరాల నియంత్రణకు ఏఐతో పారదర్శకత

విశాలాంధ్ర-హైదరాబాద్ :అవినీతి అక్రమాలు, నేరాలను నియంత్రించే క్రమంలో విజిలెన్స్ శాఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత టాస్కోర్స్ ను ఏర్పాటు చేస్తే పారదర్శకత, ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనార్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ఐదో రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సమావేశానికి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షత వహించారు. సజ్జనార్ మాట్లాడుతూ... అవినీతి, అక్రమాలు తగ్గాలంటే వ్యవస్థల్లో మౌలిక మార్పులు అవసరం. లోపభూ యిష్టమైన విధానాలు అక్రమాలకు దారితీస్తాయి. వ్యవస్థను పటిష్టపరచి, మంచి అలవాట్లు, పద్ధతులను అమల్లోకి తేవాలి అని పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. సింగరేణి సంస్థతో తనకు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. నేడు దేశ జీడీపీ పెరుగుదలలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ యువ సీఎండీ ఎన్.బలరామ్ సారథ్యంలో పలు వ్యాపార విస్తరణ చర్యల ద్వారా గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... నేటి ఆధునిక పరిస్థితుల్లో విజిలెన్స్ శాఖ అంటే శిక్షించే వ్యవస్థగా కాకుండా సంస్కరించే శాఖగా రూపు దిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి చేయాల్సిన ప్రతీ కార్యకలాపాన్ని స్థిరంగా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఎలా నిర్వహించాలో తెలిపే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసీజర్సును రూపొందించాలని సూచించారు. ఉద్యోగులకు తెలియకుండా పొరపాట్లు జరిగినప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించాలన్నారు. ప్రతీ ఉద్యోగి ప్రశాంతంగా తమ బాధ్యతలు నిర్వహించాలని, ప్రలోభాలకు లోను కాకూడదని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ చేపడుతున్న వ్యాపార విస్తరణ చర్యలను వివరించారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ తీసుకురావడం కోసం, పని గంటల సద్వినియోగం కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నామని, వ్యవస్థలను మరింత పటిష్ఠ పరిచేందుకు ఈసారి విజిలెన్స్ వారోత్సవాలలో ప్రముఖులను ఆహ్వానించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించేలా, అలాగే అంతర్జాతీయంగా ఖనిజ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

తుపాను బాధిత కుటుంబాలను ఆదుకోండి : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మొంథా తుపానుతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఆపన్న హస్తం అందించాల్సిందిగా పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ముఖ్యంగా భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోని పౌరులు, రైతుల కోసం సహాయ, పునరావాస శిబిరాలు నిర్వహించాలని పలు సంస్థలకు లేఖలు రాసారు. సామాజిక బాధ్యతగా నిత్యావసర వస్తువులు, ఔషధాలు, వైద్య సహాయం అందించాని శ్రీధర్ బాబు కోరారు. ఆపత్కాలంలో వారికి అండగా నిలిచి చితికిన కుటుంబాలను తిరిగి నిలబెట్టాలని ఆయన పేర్కొన్నారు. పొలాల్లోని పంటలు వరదలకు దెబ్బతిన్నాయని, మార్కెట్లకు తరలించిన ధాన్యం, మక్కలు వాన నీటిలో తడిసాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం అందించే సాయంతో పాటు ప్రైవేటు సంస్థల కూడా తమ వంతు సహకారం అందిస్తే అకాల వర్షాలతో నష్టపోయినవారు త్వరగా కోలుకుంటారని శ్రీధర్ బాబు అన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

విశాలాంధ్ర, హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే 'జాతీయ ఐక్యత దినోత్సవం' వేడుకల్లో భాగంగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా జరుపుకుంది. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్వే క్రీడా ప్రాంగణంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో భాగంగా ఇంటిగ్రిటీ వాకథాన్, జాతీయ ఐక్యత దినోత్సవంలో భాగంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాలు జరిగాయి. ఈ చొరవ దక్షిణ మధ్య రైల్వేలోని ఉద్యోగులలో ఐక్యత, సమగ్రతను పెంపొందించడంపై కలిగి ఉన్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన 'రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించి రన్ ఫర్ యూనిటీ, సమగ్రత వాకథాన్ కార్యక్రమంను జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, సంతోష్ కుమార్ వర్మ, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది, ఆర్.పి.ఎఫ్ మరియు క్రీడా కారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రమశిక్షణను పెంపొందించుకోవడానికి, అనుకున్న లక్ష్యాలను సాధించడానికి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇందుకుగాను ముఖ్యంగా ఉదయం వేళలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఉద్యోగులందరు తమ దైనందిక పని, పరస్పర చర్యలలో ఐక్యత, సమగ్రత విలువలను పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలన పట్ల నిబద్ధతను బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంస్థలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాన్ని కూడా ఏటా జరుపుకుంటున్నామని జనరల్ మేనేజర్ తెలిపారు. అనంతరం జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలోని అధికారులు, సిబ్బంది చేత రాష్ట్రీయ ఏకతా దివాస్ ప్రతిజ్ఞను చేయించారు.

సునీత గెలిపించండి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత, రాష్ట్ర రవాణా శాఖ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీందర్ నాయక్, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, సతీమణి ఆయేషాతో కలిసి శుక్రవారం బోరబండ డివిజన్ లోనీ సాయిబాబా నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీత గోపినాథ్ ని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎన్నిక ప్రచారం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమాజిగూడ క్లస్టర్ 303 నుండి 310 వరకు బూత్‌ల ఇంచార్జీ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత గోవర్ధన్ రెడ్డి, స్థానిక బూత్ ఇంచార్జ్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ పార్క్, శ్రీనగర్ డీ పార్క్, శాలివాహన నగర్ చిల్డ్రన్ పార్క్ లలో మరియు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. శ్రీనగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌కి మద్దతుగా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, మురుగేష్, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, నర్సింగ్ రావు, సోమాజిగూడ డివిజన్ ప్రెసిడెంట్ అప్పు ఖాన్, జహీర్ ఖాన్, చిన్న రావు, సత్యనారాయణ, ప్రసన్న రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : రహమత్ నగర్ డివిజన్‌లోని ఎస్ఎస్‌సి బి నగర్, ఓంనగర్, బ్రహ్మశంకర్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలను ఆరా తీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో జూబ్లీహిల్స్ అభివృద్ధి వేగం పెరిగిందని, ప్రస్తుతం 150 కోట్ల రూపాయలు మంజూరుతో కొంతవరకు సీసీ రోడ్లు డ్రైనేజీ పనులు జరిగాయని తెలియజేస్తూ.. ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో 'చేతి' గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పంథాను కొనసాగించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ప్రజలు నవీన్ యాదవ్ గారికి విశేష స్పందన చూపారు. ఆయన అభివృద్ధి పట్ల చూపుతున్న కృషి, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా ఉన్న తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో రోడ్ల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామిరెడ్డి, తెలంగాణ బీసీ మహిళా బోర్డు సభ్యురాలు భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర, మేడిపల్లి: మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ చౌరస్తాలో ఏఐటీయూసీ 106 ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి అంగన్వాడి వర్కర్స్ రాష్ట్ర నాయకురాలు పారిజాన్ అధ్యక్షతన శుక్రవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా మేడిపల్లి మండల సీపీఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ హాజరైనారు. ఏఐటియుసి మండల కార్యదర్శి దండు రమేష్ ఏఐటియుసి జండాను ఎగరవేసినారు. ఈ కార్యక్రమమును ఉద్దేశించి రచ్చ కిషన్, తండు రమేష్ మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని అన్నారు. కార్మిక వర్గ హక్కుల కోసమే గాక దేశ స్వాతంత్రంలో కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఆ తర్వాత ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అద్వితీయమైన కృషిచేసి అసాధారణ త్యాగాలు బలిదానాలు, పోలీస్ దాష్టికాలు, పెట్టుబడిదారుల గుండాల దాడులు, యావత్ జీవిత శిక్షలు, మరణ దండలతో ఏఐటీయూసీ చరిత్ర యావత్ ఎరుపెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సభ్యులు జి నాగరాజు, ఎండి అన్వర్, బి ఐలయ్య, కే ప్రమీల, ఆండాలు, ఇస్తారి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఎన్ ధనలక్ష్మి, జే మనోహర, డి కృష్ణకుమారి, కే కుమారి, పి సుశీల తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ....ఇందిరాగాంధీ దేశ అభివృద్ధికి చేసిన కృషి, మహిళా సాధికారతకు నిలిచిన ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆమె ఆలోచనలు, త్యాగం ఈ తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్య భారత దేశ నిర్మాణంలో పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెన్నయ్య, తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, బాల్ రాజ్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బస్వం, ముబారక్, ఖదీర్, సీతారాం, అశోక్,అన్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

50 శాతం పరిమితి ఎత్తివేస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: రానున్న శీతాకాల సమావేశాల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేస్తూ పార్లమెంట్ లో బిల్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మంది బీసీలతో పార్లమెంట్ భవనాన్ని ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్ రావుతో కలిసి జాజుల మాట్లాడారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి కారణంగానే బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు దక్కడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అడ్డురాని పరిమితులు, బీసీలకు అడ్డుపడుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు పెట్టకపోతే , ప్రధాని ఇంటి ని దిగ్బంధం తో పాటు , కేంద్ర మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. న్యాయస్థానాలు కూడా ప్రజల డిమాండ్ లను పరిగణన లోకి తీసుకుని, చట్టాలను సవరించాలని జాజుల విజ్ఞప్తి చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు కుందాల గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, శ్యామ్ కుర్మా, శేఖర్ సగర, మురళీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కోటానుకోట్ల సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం, శ్రమజీవుల స్వేధనాదం ఏఐటీయూసీ అని ఏఐటియుసి రాష్ట్ర కోశాధికారి తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 106వ, వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఏఐటియుసి శ్రేణులు ఆస్పత్రి కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మికులు ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఎర్ర చొక్కాలు మహిళా కార్మికులు ఎర్ర చీరలు ధరించి డప్పు దరువులతో మహిళల కోలాటం నృత్యాలతోభారీ ర్యాలీ సభలో కార్మికుల హక్కులకై ఉద్యమిద్దాం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతికటిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని 1920లో ఏఐటీయూసీని లాలాలలజపతిరాయ్ బిపిన్ చంద్రపాల్ లాంటి యోధులు స్థాపించారని స్వతంత్ర సంగ్రామంలో ఏఐటియుసి విప్లవ పంథాలో ఉద్యమించి బ్రిటిష్ ముష్కరులను తరిమి కొట్టిందని అన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కార్మికుల హక్కుల కోసం సంక్షేమం కోసం వీరోచిత రాజీలేని పోరాటాలు నిర్వహించిందని యా ఇటు వచ్చి పోరాట ఫలితంగానే కనీస వేతన చట్టం పిఎఫ్ ఈఎస్ఐ గ్రాటివిటీ పని గంటల తగ్గింపు లాంటి అనేక కార్మిక చట్టాలన్నీ రూపకల్పన జరిగాయని కొనియాడారు. కార్మిక వర్గం శ్రమ దోపిడీపై మిలిటెంట్ పోరు సల్పిందని అన్నారు. పాలకుల కపట రాజకీయ నీతితో సంఘటిత అసంఘటిత రంగం కార్మిక వర్గం నేటికి చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రతకు నోచుకోక వెట్టి చాకిరికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన పోరాటం వల్లే సాధ్యమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూచించిన రాజ్యాంగ పద్ధతిలో ఉద్యమిద్దామని,లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఉద్యోగ క్రమబద్ధీకరణకై మరో సంగ్రామానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ జిల్లా మెడికల్ యూనియన్ అధ్యక్షులు కోటేశ్వర్ రెడ్డి, జిల్లా కోశాధికారి భాస్కర్, బ్రాంచ్ నేతలు వెంకటేష్, గోపాల్ నాయక్, బి. చెన్నయ్య, బుచ్చన్న, అంజి, దేవానంద్, మురళి,యాదయ్య, టంకర వెంకటయ్య, మన్యం,జగ్గ నాయక్, నరేష్, రాఘవేందర్, నరసింహ,కృష్ణ, యుగంధర్ రెడ్డి,ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, పద్మ,నాగమ్మ,లక్ష్మమ్మ, అలివేలు, వరలక్ష్మి,ఇందిరా, యాదమ్మ,సత్యమ్మ, అంజమ్మ,శైలజ,జంగమ్మ, సవిత,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ జాతీయ రహదారికి వీడిన చిక్కుముళ్లు

విశాలాంధ్ర - మొయినాబాద్ : హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణకు గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు అనుకులంగా రావడం హర్షనీయమని చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యేలు యాదయ్య, రాంమ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు (చెన్నైయ్)లో శుక్రవారం ఉదయం విచారణపై తుది వాదనలు పూర్తయ్యాయని చెప్పారు. ఎన్జీటీ భారత జాతీయ రహదారుల అథారిటీ సమర్పించిన ప్రతిపాదనను ఆమోదించిందన్నారు. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు స్టే ఆర్డర్ను రద్దు చేసిందన్నారు. రోడ్డు విస్తరణ పనులు వెంటనే కొనసాగించవచ్చని ఆదేశించిందని స్పష్టం చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టుతీర్పును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కోర్టు తీర్పురావడంతో రోడ్డు పనులు వేగవంతంగా కొనసాగించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయని చెప్పారు. రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్లు మంజూరు చేసిందన్నారు. రోడ్డు పనులు పూర్తి అయితే రాజేంద్రనగర్, చేవెళ్ల, పరిగి, తాండూర్, వికారాబాద్, కొండగల్ నియోజకవర్గాలతో పాటు కర్నాటక రాష్ట్రానికి వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పీఏపీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మున్సిపాల్ అధ్యక్షుడు. శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, మైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు శైలజా ఆగిరెడ్డి, గోపాల్ రెడ్డి, మధుసూదనుగుప్తా, నర్సింలు, ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్, మహేందర్, తాజోద్దీన్ పాల్గొన్నారు.

దేశాన్ని ఒక్కటిగా చేసిన మహనీయుడు సర్దార్ పటేల్

విశాలాంధ్ర - మొయినాబాద్ : దేశాన్ని ఒక్కటిగా చేసిన మహనీయుడు సర్దార్ పటేల్ అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా చేవెళ్లలో బిజెపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం మాట్లాడుతూ... భారత దేశ తొలి హెూమ్ మినిస్టర్‌గా పనిచేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కారణంగా భారతదేశమంతా సమైక్యంగా ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో స్వేచ్ఛతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. స్వాతంత్రం తర్వాత కూడా ఆయన నిరంతర కృషితో ప్రజల కోసం, దేశం కోసం పనిచేశారన్నారు. నిజాంలు స్వయం ప్రతిపత్తి కోరితే దేశమంత సమైక్యంగా ఉండాలని దేశంలో అందరూ భాగస్వామ్యం కావాలని వారికి గట్టిగా చెప్పిన వ్యక్తి పటేల్ అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ , వైభవ్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్ , వెంకటరెడ్డి , అత్తిలి మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ , కృష్ణ, శ్రీకాంత్, బాలయ్య, కృష్ణ, మల్గారి మధుకర్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగానే టిఆర్ఎస్ (డి) పోటీ : సత్యనారాయణ

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ (డి) ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ స్పష్టం చేశారు. ఏ పార్టీతో పొత్తు ఉండదనీ, దానివల్ల తమ నాయకత్వాన్ని ప్రోత్సహించుకునే అవకాశం ఉంటుందన్నారు. 119 నియోజకవర్గాలకు తమ పార్టీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. అలాగే 17 పార్లమెంటు స్థానాలకు మనం కొత్త వాళ్లకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూనే, అనుభవానికి ప్రాధాన్యత ఇస్తూ, ఉద్యమకా రులకు, మహిళలకు తగినన్ని అవకాశాలు తమ పార్టీలో కల్పించాలని ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బొక్క నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ కృషి : వీఎస్ బోస్

విశాలాంధ్ర , కాప్రా : కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్. బోస్ అన్నారు ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని ఏఐటీయూసీ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా వద్ద ఉన్న కార్మిక జెండాను ఏఐటీయూసీ సీనియర్ నేత ఎస్. శంకర్‌రావు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్. బోస్ మాట్లాడుతూ బొంబాయి నగరంలో 1920 అక్టోబర్ 31న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఏర్పడిందని, నాటి నుంచి కార్మికవర్గ హక్కుల కోసమేగాక దేశ స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఆ తర్వాత ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అద్వితీయమైన కృషి చేసి, అసాధారణ త్యాగాలు, బలిదానాలు, పోలీసు దాష్టీకాలు,పెట్టుబడుదార్ల గూండాల దాడులు, యావత్ జీవిత శిక్షలు, మరణ దండనలతో ఏఐటీయూసీ చరిత్ర యావత్తు ఎరుపెక్కిందన్నారు. కోట్లాది మంది కార్మికవర్గ గొంతుకగా వారి గుండెల్లో స్థానం సంపాదించుకుందని, ఏఐటీయూసీ ఒకానొక చారిత్రక నేపథ్యంలో ఏర్పడిందని కొనియాడారు. భారత ప్రభుత్వం 1935 చట్టానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ 1937 ఏప్రిల్ 1 వ నిర్వహించిందని. సామ్రాజ్యవాదులు విధించిన నూతన రాజ్యాంగ చట్టానికి బదులుగా 'వయోజన ఓటింగ్' హక్కుతో ఒక 'రాజ్యాంగ సభ'ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసిందన్నారు. ఈ డిమాండ్స్ మొదటి సారిగా లేవనెత్తిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. ఏఐటీయూసీ స్వాతంత్ర్య పోరాటంలో కీలక భాగంగా వ్యవహరించింది. అందువల్లనే, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తర్వాత రాజ్యాంగంలో కొన్ని కార్మిక హక్కులకు కొద్దిపాటి హామీలు కల్పించారన్నారు. 105 సంవత్సరాలుగా కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి మరి కొన్ని హక్కులను సాధించుకోగలిగింది. వాటి అమలులో మాత్రం ప్రభుత్వాలు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. న్యాయస్థానాలలోనూ కార్మికులకు సరైన న్యాయం దొరకటం లేదు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తీసుకు వస్తున్నారు. కార్మిక వర్గాన్ని బ్రిటీష్ కాలం నాటి దుర్భర పరిస్థితికి నెట్టేస్తున్నారు. ఇప్పుడేమో నాలుగు కార్మిక కోడ్ల కొనసాగింపుగా 'శ్రమ్ శక్తి ఎన్ఐటిఐ 2026' పేరుతో నూతన జాతీయ కార్మిక విధానాన్ని ముందుకు తీసుకొస్తున్నారని, దీనిని ఖచ్చితంగా కార్మిక లోకం వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, సత్య ప్రసాద్, ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల, ఏఐటీయూసీ నేతలు నారా నర్సింహా,బాబురావు, రాఘవేంద్ర, శ్రీనారాయణ,మోహన్,ఎల్లయ్య,,కోల దయనంద్,నర్సింహా రావు, ,స్వామి దాస్, శ్రీనివాస్, నగేష్,ఆనంద్,గిరిబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు కాంగ్రెస్ పార్టీ ప్రోత్సాహం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్ నేడు అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష పదవిని స్వీకరించిన గోనెల శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందిస్తూ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇస్తుంది అన్నారు. సీనియర్ నాయకులు ఉన్నా కూడా యువతను ప్రోత్సహించాలనే దృక్పథంతో గోనెల శ్రీనివాస్‌కి ఈ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నిజాయితీతో, చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడు గోనెల శ్రీనివాస్ అని ఎమ్మెల్యే ప్రశంసించారు. చెరువులపై ఆధారపడిన మత్స్యకారుల ఆదాయవృద్ధి, మార్కెట్ విస్తరణ, ఉపాధి సృష్టిలో సంఘం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : చిన్నచిన్న రాష్ట్రాలకు ఉన్న భారతదేశాన్ని ఒక మహాభారత్ గా సృష్టించిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు అన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మల్కాజిగిరి పటేల్ నగర్ లో వల్లభాయ్ పటేల్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రరావు మాట్లాడుతూ... వల్లభాయ్ పటేల్ జయంతిని ఒక పండుగలా జరుపుకుంటున్నామంటే కారణం హైదరాబాద్ రాష్ట్రాన్ని, తెలంగాణ రాష్ట్రాన్నిభారత దేశంలో కలిసేందుకు కృషి చేసిన నాయకుడు తెలంగాణ హైదరాబాద్ ప్రాంత ప్రజలను భారతీయులుగా చేసిన వ్యక్తి వల్లభాయ్ పటేలని వారి సేవలను కొనియాడారు. బషీర్బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు రన్ నిర్వహించామన్నారు. కార్పొరేటర్ శ్రవణ్, ప్రీతం రామకృష్ణ, ఆనంద్ గౌడ్, బాలచందర్ గౌడ్, నాగరాజ్, లక్ష్మణ్, లవకుమార్, వెంకట్ కిషోర్, అనిల్, ధనరాజ్, బీజేవైఎం చందు, భరత్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్యం ఎర్ర జెండాతోనే సాధ్యం : శ్రీనివాస్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కార్మిక రాజ్యం ఎర్ర జెండాతోనే సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి నిజాంపేట్ వార్డు కార్యక్రమం,డంపింగ్ యార్డ్‌లో యాదయ్య ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐటీయూసీ ఏర్పడి 106వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటునమని, ఎంతో మంది త్యాగల, అమరుల వల్ల ఈ కార్మికుల చట్టాలు, హక్కులు అనుభవిస్తునమని గుర్తుచేశారు. ఆ హక్కులు కాపాడుకునే పరిస్థితి వచ్చిందని,కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక చట్టాలు, రైతు చట్టాలు మార్చిందని తెలిపారు. మన కార్మిక రాజ్యం సాధించాలనంటే కేవలం మన ఎర్ర జెండా ఏఐటీయూసీతోనే సాధ్యమని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, నర్సమ్మ, పొన్నికంటి దస్తగిరి, మోహన్ రెడ్డి, పరమేష్ గౌడ్, తిమన్న, సాయి, కృష్ణ, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీ రోడ్ నెం.8 లో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ సమస్యను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి స్పెషల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో శుక్రవారం సీసీ రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ పద్మారావు, మనోజ్ రెడ్డి,లక్ష్మారెడ్డి,గురువారెడ్డి,సురేష్ చంద్ర, ధర్మారావు,హరి వర్ధన్ రావు,శ్రీదేవి,రమాదేవి,జ్యోతి, విజయ్ చంద్ర,సందీప్,మాజీ సర్పంచ్ మైసి శ్రీనివాస్, ఎన్ఎంసీ జనరల్ కొలన్ జీవన్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ 16వ వార్డు మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీవాసులు ఆయనని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి పది కాలాల పాటు ప్రజాసేవలో కొనసాగుతూ, మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. నిండు నూరేళ్లు, సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

విశాలాంధ్ర మొయినాబాద్: తెలంగాణలోని ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనకమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ భూమి పూజలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నియామకపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిరుపేదలకు గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను దశలవారిగా కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామిని అమలు చేస్తూ ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు మర్రి రవిందర్రెడ్డి, గ్రామ అధ్యక్షుడు నిరంజన్రెడ్డి, ఇందిరమ్మ కమిటీ గ్రామ అధ్యక్షుడు కురుమ రాములు, మర్రి వంశీధర్రెడ్డి, గుర్రాల భాస్కర్, వనజ, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర , కాప్రా : అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, అవినీతి నిర్మూళనపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. ఏ పని చేసి నా పారదర్శకతతో చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విజిలెన్సువారోత్సవాల్లో భాగంగా మల్లాపూర్లోని భారత్ ఎలక్ట్రా నిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మల్లాపూర్లోని వివిధన వివిధ నివాస ప్రాంతాల మీదుగా దాదాపు మూడు కిలో మీటర్ల మేర ఈ అవగాహన ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా ఉద్యోగులు ప్లకార్డులు చేతబట్టుకుని "అవినీతి నిర్మూలన జరుగాలి దేశం అభివృద్ధి చెందాలి" అని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ డాక్టర్ విశ్వనాదం,డివిషనల్ హెడ్స్, విజిలెన్స్ ఆఫీసర్ రూత్ బెక్కం, దాదాపు 400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక 4 కోడ్‌లను రద్దు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కార్మిక వ్యతిరేక 4 కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్. డీ యూసుఫ్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఏఐటీయూసీ 106వ ఆవిర్భావదినోత్సవ సందర్భంగా జీడిమెట్ల ప్రాంతంలో జరిగిన పతాకవిష్కరణలు,ఊరేగింపులలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్.డి.యూసుఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 వ సంవత్సరంలో ఆవిర్భావించిన తర్వాతనే కార్మిక చట్టాలు వచ్చాయనీ, 1921లో ఫ్యాక్టరీస్ యాక్ట్‌కు సవరణలు చేయించుకున్నామని, అలాగే 1923లో కార్మిక నష్టపరిహార చట్టం, 1926లో ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1936లో వేతనాలచెల్లింపు చట్టం,1946 ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్(స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం,1947లో పారిశ్రామిక వివాదాల చట్టాలను బ్రిటిష్ వారి హయాంలోనే భారత కార్మికులకు ఏకైక సంఘంగా ఏఐటీయూసీ నిర్వహించిన పోరాటాల ద్వారా సాధించుకున్నాం. అలాగే బ్రిటిష్ హయాంలోనే 8గంటల పనిదీనాన్ని సాధించుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన సంఘాలను కలుపుకొని మొత్తంగా 44చట్టాలను సాధించుకోవటం జరిగింది. ఈ చట్టాలను ఇంకా మెరుగు పర్చుకోవాలని, అసంఘటీత కార్మికులకు చట్టాలు కావాలని పోరాటాలు నిర్వహిస్తుంటే, కేంద్రంలో పాలన చేస్తున్న మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారికి ప్రభుత్వం, వ్యాపారాలు సులభంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా నడవాలంటే కార్మిక చట్టాలు అడ్డంగా ఉన్నాయని 44కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకంగా వ్యాపారస్తులకు అనుకూలంగా 4లేబర్ కోడ్ లను తెచ్చారన్నారు. ఈ కార్మిక వ్యతిరేక కోడ్ లను రద్దు చేసి, రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్దరిచాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుంది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె. స్వామి, ఉపాధ్యక్షులు ఇ. ఉమామహేష్ ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్, నియోజకవర్గం అధ్యక్షులు వి. హరినాధరావు లులి ప్రసంగిస్తు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతన జి. ఓ లను విడుదల చేయాలన్నారు. ఏఐటీయూసీ 106 ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా జీడిమెట్ల ఈ.ఎస్.ఐ ఆసుపత్రి ఆవరణలో, ఉషోదయ టవర్స్ ఎదురుగా గల హమాలీ అడ్డా వద్ద, జీడిమెట్ల ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్. డీ. యూసుఫ్ పతకాలను ఆవిష్కరించారు. ఆర్. టీ. సీ. డిపో వద్ద జిల్లా అధ్యక్షులు కె. స్వామి, గుట్ట యార్డ్, ఐ.డీ.పీ. ఎల్ ఆటో అడ్డా వద్ద జిల్లా ఉపాధ్యక్షులు ఇ. ఉమ మహేష్, జగత్ గిరి గుట్టలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రత్నం, రంగారెడ్డి నగర్ భవన నిర్మాణ అడ్డా మరియు గాంధీ నగర్ ఏఐటీయూసీ కార్యాలయం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్, శ్రీనివాస్ నగర్, హమాలీ అడ్డా 3, మున్సిపల్ కార్యాలయం వద్ద నియోజకవర్గం అధ్యక్షులు వి. హరినాధ రావు, ప్రీమియర్ అలయిస్ కంపెనీ వద్ద దేవేందర్ ప్రసాద్, జి. ఆర్. పవర్ స్విచ్ గేర్ కంపెనీ వద్ద రమేష్ రెడ్డిలు పతాకవిష్కరణ చేసారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్. నర్సింహా రెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు సుంకి రెడ్డి, సీ. నర్సింలు, కె. మహేష్, బి నాగయ్య, బి. కనకయ్య, భవన నిర్మాణ సంఘం నాయకులు సామ్యూయెల్, మున్సిపల్ యూనియన్ నాయకురాలు టీ. కమల పాల్గొన్నారు.

పాపంపేట బాధితులకు అండగా ఉంటాం

- 15 రోజుల్లో భూకబ్జాదారుల సంగతి తేల్చకుంటే చలో అమరావతి
- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: అనంతపురం పట్టణ శివారు పాపంపేటలో భూ కబ్జా కోరుల భరతం పడతామని, అక్కడి బాధితులకు అండగా నిలబడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ భరోసా కల్పించారు. శుక్రవారం పాపంపేటలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షతన పాపంపేట భూ బాధితులకు అండగా జిల్లా సీపీఐ అధ్వర్యంలో జరిగిన బహిరంగ సభ ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ పాపంపేట ఊరంతా కబ్జా చేస్తుంటే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సుమారు 15 వేల కుటుంబాలను భయపెట్టి కబ్జాలకు పాల్పడుతూ భూములన్నీ మావేనంటూ భయపెడుతుంటే చోద్యం చూస్తున్నారని... ఇంతకంటే దుర్మార్గం ఏముందని పాలకులను రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన 6 మంది ఐపీఎస్, డీజీపీ ర్యాంక్ అధికారులు జైలుకు వెళ్లడం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం వద్దు అనుకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీస్ స్టేషన్లన్నీ ఎమ్మెల్యేల ఇంటి వద్ద ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారు. నగరంలో ఒక భాగమైన పాపం పేటను మాది అంటూ కొందరు తెగేసి చెప్పడం చూస్తుంటే ఎంతకు బరితెగించారో అర్థమవుతుందన్నారు. 1964 డిసెంబర్26 న అప్పటి ప్రభుత్వం స్తోత్రము భూముల పై ఒక ప్రకటన చేసిందని గుర్తు చేశారు. పాపంపేట భూముల్లో మాకు హక్కుందంటూ కొందరు ముందుకు రావడంతో వారికి సర్వేయర్, వీఆర్ఓ, ఆర్ఐలు తప్పుడు రికార్డులు సృష్టించి హైకోర్టులో అనుకూల తీర్పు వచ్చేలా చేస్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మీరు దుర్మార్గంగా వ్యవహరిస్తే బాధితుల తరఫున సీపీఐ ఎర్ర జెండా అండగా ఉంటుందని, ఎవరూ భయపడవద్దని భరోసా ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే సునీత చుట్టూ కబ్జాదార్లు చేరి పోయారని ఆమెను రాజకీయంగా సమాధి చేసే వరకు దుష్టులు వదిలిపెట్టరని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒక సోదరిగా ఆమెకు సలహా ఇస్తున్నానన్నారు. భూకబ్జా లో ఎమ్మెల్యే సునీత ప్రమేయం లేదంటే ఎవరూ నమ్మడం లేదని...మీ ప్రమేయం లేకపోతే భూ కబ్జాదారులపై చర్యలు తీసుకునేలా అధికారులపై ఒత్తిడి తేవాలని సూచించారు. భూ బాధితులతో కలిసి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వెళతామని, 15 రోజులు సమయం ఇచ్చి న్యాయం జరిగేదాకా సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరమైతే చలో అమరావతి కార్యక్రమాన్ని పెట్టి ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్తామన్నారు. కబ్జాదారులకు అండగా నిలిచిన అధికారులందరినీ సస్పెండ్ చేయాలని , ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని... అక్రమాలకు పాల్పడినవారిని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర నాయకులు డి.జగదీశ్ మాట్లాడుతూ 15 వేల కుటుంబాలు నివశించే ప్రదేశాన్ని భూకబ్జాదారులు లంచగొండి అధికారుల అండతో 70 సవంత్సరాలుగా జీవనం సాగిస్తున్న నిజమైన లబ్ధిదారులకు సంబంధించిన విలువైన స్థలాన్ని లాగేసుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇలాంటి దొంగలకు ఏ రూపంలో బుద్ధి చెప్పాలో కమ్యూనిస్టు పార్టీకి కొత్త కాదని జగదీశ్ హెచ్చరించారు. పాపంపేట వాసులకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర నాయకులు సీ జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు సీ మల్లికార్జున, జె. రాజారెడ్డి, జిల్లా నాయకులు పి.రామకృష్ణ, ఎన్. శ్రీరాములు, బీ కేశవరెడ్డి, టీ నారాయణ స్వామి, పద్మావతి, జిల్లా కార్యవర్గ సభ్యులు బీ రమణ, ఎం.రమేష్, సీ లింగమయ్య, రాజేష్, సంతోష్ కుమార్, రాప్తాడు మండల సహాయ కార్యదర్శి రామకృష్ణ, నగర సహాయ కార్యదర్శి వీ కృష్ణుడు, అనంతపురం, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శులు నరేష్, బీ రామకృష్ణ, లోకసత్తా జిల్లా అధ్యక్షులు అశోక్, పాపంపేట భూ పరిరక్షణ సమితి నాయకులు గోపాలరెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో యుద్ధప్రాతిపదికన నీటి మళ్లింపు

- ఉపగ్రహ చిత్రాలతో గుర్తించి కార్యాచరణ
- టెలి కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- రాజధాని నిర్మాణ పనులపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మొంథా తుపానుతో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తుపాను తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఉపగ్రహ చిత్రాలు విడుదల చేసి... ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడకి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. సమన్వయంతో పని చేసి ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలని, తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల కన్నా ఎక్కువగా బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బాపట్ల జిల్లాలో ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామన్నారు. రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెనువెంటనే ప్రాథమిక నివేదిక అందించి, తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించేలా కోరాలని అధికారులకు సీఎం సూచించారు. తాను ప్రధాని మోదీతో మాట్లాడతానని చెప్పారు. కృష్ణా నదిలో నీటి నిల్వల వివరాలను చంద్రబాబు అడిగి తెలుసు కున్నారు. తుపాను రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పని చేసిన 100 మందిని గౌరవించుకునేలా శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం సూచించారు.

నిర్దేశిత సమయానికి రాజధాని పనులు పూర్తి కావాలి

రాజధాని నిర్మాణ పనులు నిర్దేశించుకున్న కాలానికి పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. పనుల పురోగతి, సుందరీకరణ, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు? కార్మికశక్తి ఏ మేరకు ఉంది? అవసరమైన నిర్మాణ సామాగ్రి, యంత్రాలను ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనే దానిపై వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణాల్లో వేగం, నాణ్యత ఉండాలన్నారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకు సమీక్షిస్తానని చెప్పారు. వర్షాల కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగినా... రానున్న రోజుల్లో పనులు వేగవంతం కావాలని చంద్రబాబు సూచించారు. కొన్ని నిర్మాణ సంస్థలు వర్క్ ఫోర్స్, మెషీనరీని పూర్తి స్థాయిలో కేటాయించలేదని, అవన్నీ తమ పనితీరు మెరుగుపరుచు కోవాలన్నారు. 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని, చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగ్ ఉన్నట్లు అధికారులు తెలుపగా... తక్షణమే వాటిని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. త్వరలోనే రాజధాని రైతులతో సమావేశమవుతానని చంద్రబాబు తెలిపారు. సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలే శరణ్యం

- కార్మికవర్గం ప్రతిజ్ఞ
- ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం
- వాడవాడలా పతాకావిష్కరణ
- కార్మికులకు నేతల శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ పతాకాన్ని నేతలు ఎగురవేసి...ఏఐటీయూసీ కార్మికోద్యమ చరిత్ర, విశిష్టతను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యోద్యమంలో కీలక భూమిక వహించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని కొనియడారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అనేక చోట్ల ఏఐటీయూసీ, అనుబంధ రంగాల యూనియన్లు రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. అనంతపురం లో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధిత మెడికల్, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ, ఆటో స్టాండ్లు, హమాలీ యూనియన్లు, లారీ డ్రైవర్ల యూనియన్లు, గూడ్సు, కారు డ్రైవర్ల యూనియన్ల నేతల నేతృత్వాన వివిధ ప్రాంతాల్లో యూనియన్ జెండాలు ఎగురవేశారు. ఈ వేడుకలకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ విచ్చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏఐటీయూసీ పతాకాన్ని జాతీయ కార్యదర్శి గుజ్జుల ఓబులేసు ఎగురవేశారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య అధ్యక్షతన సభ జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావుపల్లి రవీంద్రనాథ్, కోశాధికారి బీవీ కొండలరావు, ఆంధ్ర బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ ఎల్లారావు, జాయింట్ సెక్రటరీ కృష్ణమోహన్ తదితరులు హాజరయ్యారు. కార్మిక వర్గానికి ఓబులేసు, రవీంద్రనాథ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు, ఏపీఎస్ఆర్టీసీ లైసెన్స్ పోర్టల్, సివిల్ సప్లయిస్ ముఠా కార్మికులు హాజరయ్యారు. విజయవాడ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ప్రాంతంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఏఐటీయూసీ జెండాను రవీంద్రనాథ్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ రావు, కార్యధర్శి పి.నాగరాజు, గౌరవాధ్యక్షులు డాక్టర్ ప్రసాద్, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాశ్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మావతి, ఎస్.వెంకటేశ్వరరావు, పి.సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ గొల్లపూడి డిపోలో ఏఐటీయూసీ జెండాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య ఎగురవేశారు. డిపో మేస్త్రి సదయ్య పవన్ కుమార్ రవికుమార్ శ్రీనివాస్ తదితరులు నాయకత్వహించి పాల్గొన్నారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి ఆంధ్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కామినేని అచ్యుతబాబు, విన్ విజన్ కంటి వైద్యులు, సిబ్బంది హాజరయ్యారు. దాదాపు 92 మందికి వైద్య సేవలందించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, ఎస్.వెంకట సుబ్బయ్య, నాయకులు కొండలరావు తదితరులు హాజరయ్యారు. ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గుంటూరు నగరంలోని నగర ముఠా కార్మిక సంఘ కార్యాలయం రేగుల రాఘవయ్య భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ జెండాను రాధాకృష్ణమూర్తి, సీపీఐ జెండాను కోట మాల్యాద్రి ఆవిష్కరించారు. జీవీ కృష్ణారావు విగ్రహానికి చల్లా చిన్న ఆంజనేయులు పూలమాలతో నివాళులర్పించారు.

స్వాతంత్ర్యోద్యమంలో పోరాడిన ఏఐటీయూసీ: రామకృష్ణ

అనంతపురంలో రామకృష్ణ మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనన్నారు. ఎన్నో పోరాటాలు నిర్వహించి...కార్మిక హక్కులను ఏఐటీయూసీ కాపాడుతోందని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్ర పోషించని వారు ఈ రోజు అధికారంలోకి వచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకమైన నిర్ణయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 44 కార్మిక చట్టాలను రూపుమాపి 4 లేబర్ కోడ్లను తీసుకురావడమే అందుకు నిదర్శనమన్నారు.రామకృష్ణతోపాటు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజేశ్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, జిల్లా కార్యదర్శులు రాజు, ఇబ్రహీం, జిల్లా నాయకులు రామకృష్ణ, కృష్ణానాయక్, బాషా, నారాయణ, వేణు, అక్బర్, వెంకటేశ్, రాము, దుర్గాప్రసాద్, రఫీ తదితరులు హాజరయ్యారు.

కార్మిక వర్గ పోరాటాలు: రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య

దేశంలో జాతీయస్థాయిలో మొట్టమొదటి అఖిలభారత కార్మికసంఘంగా ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31వ తేదీన ఆవిర్భవించిందని, ఇప్పటికి 105 సంవత్సరాలు పూర్తి చేసుకుని 106వ సంవత్సరంలోకి ప్రవేశిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, ఎస్.వెంకట సుబ్బయ్య తెలిపారు. విజయవాడలో జరిగిన కార్యక్రమాల్లో రవీంద్రనాథ్, వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఏఐటీయూసీ ప్రముఖపాత్ర పోషించిందని తెలిపారు. మన నాయకులు బ్రిటిష్ నిర్బంధకాండకు గురయ్యారని, జైళ్లలో మగ్గిపోయారని, అపార త్యాగాలు చేశారని గుర్తుచేశారు. జాతీయోద్యమంలో కార్మిక, సామాజిక అజెండాను గట్టిగా ముందుకు తేవడంలో ఏఐటీయూసీ చేసిన కృషి గొప్పదని, రాజ్యాంగ ఆదర్శాల రూపకల్పనలో యూనియన్ పాత్ర ఎనలేనిదని కొనియాడారు.

ప్రభుత్వ విధానాలతో పేద విద్యార్థులకు నష్టం

విజయవాడకు ఏఐఎస్ఎఫ్ బస్సు జాతా

విశాలాంధ్ర–విజయవాడ: రాష్ట్రంలో పేద ప్రజలకు విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలపై, విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో జరుగుతున్న బస్సు జాతా శుక్రవారం విజయవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా ధర్నాచౌక్ వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయి అధ్యక్షతన జరిగిన సభలో నాసర్ జీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను ఒకపక్క కాషాయీకరణ చేస్తూ విద్యార్థులకు శాస్త్రీయ విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తూ విద్యా హక్కు చట్టాన్ని అపహాస్యం చేసే విధానాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ప్రతి విద్యార్థికి ఉందన్నారు. ఎన్నిక సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వంద రోజుల్లో చెల్లిస్తామని, విద్యా శాఖలో ఖాళీలను భర్తీ చేస్తామని హామీలు ఇచ్చిన విషయం విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు గుర్తుందా అని ప్రశ్నించారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు గుజ్జుల వలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులు విద్య పూర్తి చేసినప్పటికీ... ఫీజు బకాయిలు ప్రభుత్వం నుంచి రాలేదన్న కారణంతో ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ కారణంగా అనేక మంది ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని అన్నారు. 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ, నిర్మాణాలకు నిధులు లేవనే సాకుతో వాటిని లీజు పేరుతో ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయాలనే ఆలోచన దుర్మార్గమని తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ బస్సు జాతా ద్వారా 26 జిల్లాలలో విద్యార్థులను చైతన్యపరచి భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా రంగంలో బడా విద్యా వ్యాపారులందరూ అధికార పార్టీకి చెందిన వారేనని, వారు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామనడం పచ్చి మోసపూరిత విధానమని విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడమంటే... మధ్య తరగతి విద్యార్థులే కాకుండా, ప్రత్యక్షంగా సామాన్య ప్రజలకు ఉచిత వైద్యం దూరం చేయడమేనని అన్నారు. ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో జరిగే ఎటువంటి ఉద్యమానైనా ముందుండి నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫణీంద్ర, సహాయ కార్యదర్శులు నాగభూషణం, కుల్లాయి స్వామి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్, మహిళా నాయకులు షణ్ముఖ ప్రియ, ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ పరకామణి చోరీ కేసులో ప్రతివాదులకు నోటీసులు

తదుపరి విచారణ 17కి వాయిదా వేసిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: టీటీడీ పరకామణి చోరీ కేసుపై శుక్రవారం విచారణ నిర్వహించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు నోటీసులు జారీ చేసిన వారిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, తిరుపతి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీఐడీడీజీ, టీటీడీ ఈవో, సీవీఎస్ఓ, తిరుపతి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ, పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీష్ కుమార్, నిందితుడు పీవీ రవికుమార్ ఉన్నారు. తదుపరి విచారణను నవంబరు 17వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని న్యాయమూర్తులు జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ సుభేందులకు చీఫ్ జస్టిస్ అప్పగించారు. పరకామణి చోరీ కేసుపై రాజీ, ఇతర అంశాలపై తాను ఇచ్చిన ఉత్తర్వులను సీజే ముందు ఉంచాలని గతంలో సింగిల్ జడ్జి ఆదేశించిన విషయం తెలిసిందే.

తూర్పు నౌకాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం : తూర్పు నౌకాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ప్రస్తుత నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నౌకాదళ అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సంజయ్ భల్లా 1989, జనవరి ఒకటో తేదీన భారత నావికాదళంలో చేరారు. 36 ఏళ్లు పాటు కమాండింగ్ స్టాఫ్, ఇతర హోదాల్లో పనిచేశారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో స్పెషలైజేషన్ కోర్సు పూర్తిచేసిన తర్వాత వివిధ ఫ్రంట్ లైన్ యుద్ధ నౌకలలో స్పెషలిస్ట్ గా పనిచేశారు. ఐఎన్ఎస్ నిశాంక్, ఐఎన్ఎస్ లా రాగిరి, ఐఎన్ఎస్ బియాస్ యుద్ధ నౌకల్లో ఫ్లగ్ ఆఫీసర్ కమాండింగ్ ఈస్టర్న్ ఫ్లీట్ గా పనిచేశారు. ఇండియన్ నేవీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రెసిడెంట్స్ ఫ్లీట్రివ్యూ, మిలాన్–22 సీఫెజ్లో టాక్టికల్ కమాండ్ ఆఫీసర్ గా విధులు నిర్వహించారు. నౌకదళ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఆఫ్ స్టాఫ్ వెస్టర్న్ నావల్ కమాండ్ డైరెక్టర్ గా పనిచేశారు. నేవల్ హెడ్క్వార్టర్స్ చీఫ్ ఆఫ్ పర్సనల్ గా పనిచేశారు. ఈ సమయంలో పరిపాలన విభాగంలో వివిధ సంస్కరణలతో పాటు ఉద్యోగుల ఎంపిక, శిక్షణా తరగతులు, సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యం, కమ్యూనిటీ కార్యక్రమాలను నిర్వహించారు. భల్లా... రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్– లండన్, నావల్ వార్ కాలేజ్ –గోవా, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్– వెల్లింగ్టన్ పూర్వ విద్యార్థి. ముఖ్యంగా లండన్ కింగ్ కాలేజీలో ఇంటర్నేషనల్ సెక్యూరిటీ, స్ట్రాటజిక్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన సందర్భంగా సంజయ్ భల్లాకు అతి విశిష్ఠ సేవా పతకం, నౌసేన పతకాలు లభించాయి. సముద్రతీర ప్రాంత పరిరక్షణతోపాటు, త్వరలోనే ఇండియన్ నేవీ చేపట్టనున్న మిలాన్–26, ఐఎస్ఆర్‌ను విజయవంతం చేసేందుకు అందరి సమన్వయంతో పనిచేస్తామన్నారు.

నేడు లండన్‌కు సీఎం దంపతులు

ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సులో అవార్డు అందుకోనున్న భువనేశ్వరి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరితో కలిసి శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఇది వారి వ్యక్తిగత పర్యటన. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నవంబరు 4న లండన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు అందించనుంది. హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్సలెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సు విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అదే వేదికపై అందుకోనున్నారు. విశిష్ట వ్యక్తిగా పేర్కొంటూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నారా భువనేశ్వరిని డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు 2025కు ఎంపిక చేసింది. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకంగా పని చేసినందుకు ఆమెను సన్మానించనుంది. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నుంచి భువనేశ్వరి ఈ అవార్డు అందుకోనున్నారు. ఎఫ్ఎంసీజీ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్సలెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సు విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డుకు ఐఓడీ ఎంపిక చేసింది. ఈ పర్యటనలో భాగంగా నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో జరుగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు బ్రిటన్ పారిశ్రామిక వేత్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించనున్నారు. నవంబరు 6న తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.